PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 292 | విజయవాడ, సోమవారం 26 మే 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 26 May 2025 | Rs

'మణిపూర్' పేరు తొలగింపుపై

వెల్లువెత్తిన ఆందోళనలు

- రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్తత
- టియర్ గ్యాస్ ప్రయోగించడంతో పలువురికి గాయాలు

5



విజయంతో చెన్నై నిష్క్రమణ

- 83 పరుగుల తేడాతో గుజరాత్ ఓటమి

6



విజయనగరం జిల్లా వేపాడలో పొలాల్లో చేరిన వర్షపు నీరు

ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

పార్వతీపురం మన్యంలో కుండపోత

27న అల్పపీడనం • నేడు మోస్తరు వర్షాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడి ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం పడింది. ఉదయం అంతా ఎండ కాసినప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వీరఘట్టం మండలంలోనూ, విజయనగరం జిల్లా వేపాడలోనూ భారీ వర్షం పడింది. వేపాడ మండలంలోని పొలాల్లో వర్షపు నీరు చేరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో 17.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. కాకినాడ జిల్లాలో యు.కొత్తపల్లి, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తాళ్లరేవు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి జల్లులు, తిరుపతిలో చిరు జల్లులు పడ్డాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది.

ఈ నెల 27 నాటికి పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఒక ద్రోణి తూర్పు మధ్య అరేబియా సముద్రం నుంచి ఉత్తర ఒడిశా వరకు, మధ్య మహారాష్ట్ర, ఉత్తర తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా సగటు సముద్ర మట్టానికి 1.5, 4.6 కిలోమీటర్ల మధ్య దక్షిణ దిశగా విస్తరించి ఉంది. నైరుతి రుతుపవనాలు ఆదివారం పశ్చిమ మధ్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, మొత్తం గోవా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, మణిపూర్, నాగాలాండ్‌లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్ని ప్రాంతాల్లో పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లతో వీచే అవకాశం ఉంది. రాగల ఏడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

ఢిల్లీలో భారీ వర్షం

2



సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, సిఎంలు, పవన్ కల్యాణ్ సహా పలురాష్ట్రాల డిప్యూటీ సిఎంలు

అసమాన ధైర్య సాహసాలు

- ఆపరేషన్ సిందూర్‌లో సాయుధ దళాలను కొనియాడుతూ తీర్మానం
- ఎన్‌డిఎ సమావేశంలో ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా సాయుధ దళాల అసమాన ధైర్య సాహసాలను ఎన్‌డిఎ సమావేశం కొనియాడింది. ఈ మేరకు సమావేశంలో తీర్మానం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన భాగస్వామ్య పక్షాల సమావేశం ఆదివారం నాడిక్కడ అశోకా హోటల్‌లో జరిగింది. కేంద్రంలో ఎన్‌డిఎ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం జరిగింది. మోడీ 3.0లో ఏడాది పాలన, ఆపరేషన్ సిందూర్, దేశ భద్రత సహా పలు అంశాలపై చర్చిం చారు. ఈ సమావేశంలో బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, 19 రాష్ట్రాల సిఎంలు, పలువురు ఉప ముఖ్య మంత్రులు పాల్గొన్నారు. ఈ సమావేశాని కి రాష్ట్రం నుంచి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీ సిఎంల సమావేశం ఆపరేషన్ సిందూర్‌పై తీర్మానాన్ని ఆమోదించింది. ఆపరేషన్ సిందూర్ విజయంలో సాయుధ బలగాలు ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలను, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని అభినందిస్తూ ఈ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆపరేషన్ సిందూర్ తరువాత తొలిసారి ఈ సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయంలో సాయుధ బలగాలు, మోడీ నాయకత్వాన్ని అభినందిస్తూ ఒక తీర్మానాన్ని శివసేన నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రవేశపెట్టారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశ ప్రజల్లో నైతిక స్థైర్యం, ఆత్మస్థైర్యం పెరిగిందని ఆ తీర్మానం పేర్కొంది. మోడీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, సాయుధ బలగాలను ప్రధాని వెన్నంటి పోత్సహిస్తూ వచ్చారని, ఉగ్రవాదులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారికి ఆపరేషన్ సిందూర్ గట్టి సమాధానం ఇచ్చిందని తెలిపింది. ప్రధాని మోడీ మూడో టర్మ్‌లో ఎన్‌డిఎ ఏడాది పాలన, సుపరిపాలనాంశాలు, కులగణన అంశం వంటివి సమావేశంలో చర్చించారు. పలువురు రాష్ట్ర మంత్రులు తమ రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను వివరించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు.

నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ : పవన్

భారతదేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. నీతి ఆయోగ్ ప్రకారం, భారతదేశ జిడిపి ప్రస్తుతం 4.18 ట్రిలియన్‌కు చేరుకుందని గుర్తుచేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని ప్రధాని మోడీ దూరదృష్టి గల నాయకత్వం, అలాగే 2014 నుంచి ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రగతిశీల పాలనకు నిదర్శనంగా చెప్పుకోవచ్చని తెలిపారు. గత దశాబ్దంలో, ఎన్‌డిఎ ప్రభుత్వ సుపరి పాలన కింద, భారత్ అభివృద్ధి పయనాన్ని నాలుగు ముఖ్యమైన అంశాలు నడిపించాయని పేర్కొన్నారు. భారత్ వృద్ధి కథ, ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, చేరిక, డిజిటల్ పరివర్తనతో నడిచిందన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి, వికసిత్ భారత్ - 2047 వైపు నడిపించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

తిరగబడకపోవడం వల్లే...

- పహల్గాం ఉగ్రదాడి బాధిత మహిళలపై బిజెపి నేత అవాకులు



భివాని : పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసే బిజెపి నాయకులు రోజు రోజుకూ పెరిగిపోతున్నారు. తాజాగా హర్యానా బిజెపి రాజ్యసభ సభ్యుడు రామ్‌చందర్ జాంగ్రా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. పహల్గాంలో కాల్పుల సమయంలో ఉగ్రవాదులు తమ భర్తలను చంపుతున్నప్పుడు మహిళలు ఎలాంటి యుద్ధ స్ఫూర్తి ప్రదర్శించలేదని, చేతులు జోడించి వేడుకున్నారని అన్నారు. ఇండోర్ రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి సందర్భంగా భివానీలో బిజెపి శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అహల్యాబాయి జీవిత చరిత్రను మహిళలు చదివుంటే వారి కళ్లముందే వారి భర్తలను ఉగ్రవాదులు చంపుతున్నప్పుడు తిరగబడేవారని అన్నారు. చేతులు ముడుచుకున్నంత మాత్రాన ఎవరూ వదిలిపెట్టరని అన్నారు. విమర్శలు రావడంతో తన వ్యాఖ్యలను వక్రీకరించారని, తన మాటలకు ఎవరైనా బాధపడి ఉంటే వారికి క్షమాపణలు చెప్పడానికి ఎలాంటి అభ్యంతరం లేదని ప్రకటన విడుదల చేశారు. అమరవీరులను, వారి భార్యలను యుద్ధంలో పాల్గొన్న వారిని కించపరుస్తూ తరచూ బిజెపి నేతలు వ్యాఖ్యలు చేయడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పహల్గామ్ బాధితులను, యుద్ధంలో పాల్గొన్న వారిని కించపరచడంలో బిజెపి నేతల మధ్య పోటీ ఉందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శిం చారు. మధ్యప్రదేశ్ డిప్యూటీ సిఎం, మంత్రి... కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసినా పదవుల్లో కొనసాగుతున్నారని, మహిళల గౌరవం కోసం ఇలాంటి దుర్మార్గ వ్యాఖ్యలు చేసే వారిని తొలగించాలని ప్రధానిని డిమాండ్ చేశారు. 'మహిళలను అవమానించడం, వేధించడం, అన్ని విధాలుగా దోపిడీ చేయడం బిజెపి నిజమైన రూపం. ఇది అసహ్యకరమైనది, చాలా సిగ్గు చేటు. బిజెపి ఒక పార్టీ కాదు, మహిళా వ్యతిరేక మనస్తత్వం కలిగిన సమూహం' అని సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ విమర్శించారు.

మాజీ మంత్రి 'కాకాణి' అరెస్ట్!

- నేడు కోర్టులో హాజరు
- 45 రోజులుగా అజ్ఞాతంలోనే..



ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు పోలీసులు ఆదివారం బెంగుళూరులో అరెస్టు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయనను కోర్టులో సోమవారం హాజరుపర్చనున్నారు. పొదలకూరు మండలం తాటిపర్తి సమీపంలో రుస్తుం మైన్స్ నుంచి అక్రమంగా క్వార్జ్ తరలించినట్టు, పేలుడు పదార్థాలు అక్రమంగా నిల్వ ఉంచినట్లు గోవర్ధన్ రెడ్డిపై పొదలకూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనకు పోలీసులు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్‌లో అంటున్న కాకాణిని విచారణకు హాజరు కావాలంటూ నెల్లూరు రూరల్ డిఎస్‌పి శ్రీనివాసరావు మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో మార్చి 20 నుంచి కాకాణి ప్రయత్నాలు చేశారు. హైకోర్టు ఈ విచారణను మూడుసార్లు వాయిదా వేసింది. చివరికి బెయిల్ నిరాకరించింది. దీంతో, ఆయన సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. విచారణాంతరం బెయిల్ ఇవ్వడం కదరదని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది అప్పటి నుంచి కాకాణి 45 రోజులుగా అజ్ఞాతంలో ఉన్నారు. ఆయనను అరెస్ట్ చేసేందుకు నెల్లూరు జిల్లా పోలీసులు హైదరాబాద్, బెంగళూరు, శ్రీలంక,తో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలియకపోవడంతో దేశం వదలి వెళ్లకుండా ప్రభుత్వం లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. బెంగళూరులో కాకాణి ఉన్నారన్న సమాచారంతో పోలీసు ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్లి ఆదివారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్టు సమాచారం.

ఈ విషయంపై పోలీసులు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఆదివారం రాత్రి ఆయనను పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు తీసుకొచ్చినట్లు తెలిసింది. కాకాణి అరెస్ట్ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా నెల్లూరులో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకాణి నివాసం వద్ద, వైసిపి జిల్లా కార్యాలయంలోనూ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కాకాణి అరెస్టుపై వారు చర్చించినట్లు సమాచారం.



కుప్పంలో సిఎం గృహప్రవేశం

- అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరణ

3

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

- ఎన్‌కౌంటర్ మృతుల భౌతికకాయాల్ని బంధువులకు అప్పగించాలి
- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

2

ప్రమాదంలో విద్యా వ్యవస్థ

- కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదే
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత జాతీయ అధ్యక్షులు విపి.సాను

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్(అన్నమయ్య జిల్లా)

విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడిందని, కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదేనని ఎస్ఎఫ్ఐ అఖిల భారత జాతీయ అధ్యక్షులు విపి.సాను తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత సమావేశం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఆదివారం నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించే సమావేశం ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. రాష్ట్రం నలుమూలల నుండి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి విపి.సాను మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ పేదవారికి విద్య అనేది అందరి ద్రాక్షగానే మారిందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు పేదలకు విద్యను మరింత దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యలో కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందని, దీనిని విద్యార్థులందరూ ప్రతిఘటించాలని కోరారు. గతంలో జరిగిన పుల్వామా దాడిలో దాదాపు 40 మంది సైనికులు ప్రాణత్యాగం చేస్తే వారి కుటుంబాలకు ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి న్యాయమూ చేయలేదన్నారు. ఆ దాడి ఘటనను 2019 ఎన్నికల ప్రచారంలో వాడుకొని బిజెపి లబ్ధి పొందిందని తెలిపారు. పహల్గాం ఉగ్ర దాడిని కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకొని ఇప్పుడు బీహార్ ఎన్నికలలో లబ్ధి పొందాలని చూస్తోందని పలువురు అంటున్నారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థకు చేసిన మేలు శూన్యమన్నారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు లేకుండా ప్రభుత్వ సంస్థలన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందన్నారు. ఆఖరికి దేశాన్ని కాపాడే సైన్యంలో కూడా కాంట్రాక్ట్ పద్ధతిని ప్రవేశపెట్టిన ఘనత ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలు విడనాడాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలో రాష్ట్రంలో ఎంతోమంది ప్రాణత్యాగాల ఫలితంతో కాపాడుకుంటూ వస్తున్న ఎయిడెడ్ విద్యా సంస్థలను ప్రయివేట్ పరం చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. పాఠశాలల మూసివేతను ప్రభుత్వం ఆపాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. భవిష్యత్తులో విద్యారంగ సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. హాజరైన ప్రతినిధులు భగత్‌సింగ్, జ్యోతిబాఫూలే, సావిత్రిబాయి ఫూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న అఖిల భారత అధ్యక్షులు విపి.సాను

ఆర్‌జెడి నుంచి తేజ్ ప్రతాప్ బహిష్కరణ



పాట్నా : తన పెద్ద కుమారుడు తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను పార్టీనుండి బహిష్కరిస్తున్నట్లు రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ ప్రకటించారు. పార్టీ నుండి ఆరేళ్లపాటు బహిష్కరణ విధిస్తున్నట్లు ఆదివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కుటుంబంతో కూడా ఎలాంటి సంబంధాలు ఉండవని తెలిపారు. వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించేలా తేజ్ ప్రతాప్‌యాదవ్ ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతని ప్రవర్తన కుటుంబ విలువలు, సాంప్రదాయాలకు అనుగుణంగా లేదని మండిపడ్డారు. అనుష్కయాదవ్, తాను 12 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని తేజ్ ప్రతాప్ యాదవ్ శనివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. తన ఫేస్‌బుక్ ఖాతా హ్యాకింగ్‌కు గురైందని, తన కుటుంబాన్ని, తనను కించపరిచేలా ఫొటోలను ఎడిట్ చేశారని తాజాగా తేజ్‌ప్రతాప్ పేర్కొన్నారు.

సకల సౌకర్యాల కల్పన

- మహానాడు ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష
- వేదిక, ప్రాంగణాల పరిశీలన

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం-చెర్లోపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టిడిపి రాష్ట్ర మహానాడు ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, నారాయణ, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, రామగోపాల్‌రెడ్డి సమీక్షించారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ప్రత్యేకంగా వారు సమావేశమయ్యారు. మహానాడు కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభకు పెద్ద ఎత్తున హాజరు కానున్న ప్రజానీకానికి అవసరమైన వసతి, వాహన, భోజన, వేదిక ఏర్పాట్లు ఎలా ఉన్నాయనే దానిపై చర్చించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27, 28, 28 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసే ప్రజలకు మెరుగైన వాహన సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతి నియోజక వర్గం నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. వాహనాల్లో వచ్చే వారికి ప్రత్యేక పార్కింగ్‌లు, భోజన, వసతులు, తదితర ఏర్పాట్లు పక్కాగా, పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, స్వచ్ఛాంధ్ర మిషన్ చైర్మన్ పట్టాభిరాం సభా ప్రాంగణంలో పారిశుధ్య పనులపై సమీక్షించారు. మహానాడు ప్రాంగణంలో చేపట్టాల్సిన పారిశుధ్య ఏర్పాట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులకు సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్నానంతరం టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ సహా మంత్రులు మహానాడు వేదిక, సభా ప్రాంగణం, పరిసరాలను పరిశీలించారు. ఈ నెల 18 నుంచి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు అధ్యక్షతన సాగుతున్న మహానాడు వేదిక ఏర్పాట్ల పరిశీలనకు వస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు కార్పొరేషన్ల ఛైర్మన్లు వరుసగా సమీక్షలు చేస్తున్నారు.



మహానాడు ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రులు

బెదిరించొద్దు, పిలిచి చర్చించండి

- పవన్ కల్యాణ్ 'సినీ పరిశ్రమ' ప్రకటనపై సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సినీ పరిశ్రమను బెదిరించొద్దని, పిలిచి చర్చించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. తెలుగు సినీరంగంలో ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం పట్ల కనీస కృతజ్ఞత లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా తెలుగు సినిమా సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారా? అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటనపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సింగిల్ థియేటర్ యజమానులు తమ సమస్యల పరిష్కారం కోసం థియేటర్ల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మొత్తం సినిమా పరిశ్రమను బెదిరిస్తూ వాళ్ల తమ దగ్గరికి చర్చలకు రావాలని, గౌరవాన్ని నిలబెట్టుకోవాలని కోరటం బెదిరించే పద్ధతిలో ఉందని తెలిపారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, అదే సినిమా రంగం నుంచి వచ్చి ఈ రకంగా మొత్తం పరిశ్రమనే బెదిరించి తమ వద్దకు తెచ్చుకోవాలనే పద్ధతిలో వ్యవహరించడం సరికాదని సూచిం ఓచారు. సినిమా నిర్మాతల, థియేటర్ల యజమానుల సమస్యలు ఏమిటో తెలుసుకొని సినీ పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేయాలని, అందు కోసం ఆయా సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించి చర్చించాలని కోరారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు గడిచినా ఇంతవరకు ఇక్కడ సినీ పరిశ్రమ అభివృద్ధి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్రంలో ఎన్నో అవకాశాలున్నా యని, స్టూడియోలు నిర్మించుకొని విస్తరించడానికి ప్రభుత్వం దోహదపడాలని కోరారు. వేలాదిమంది కళాకారులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మంది ఆధారపడే సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ రంగం లోని ప్రముఖులను, థియేటర్లు, 24 క్రాఫ్ట్‌కు సంబం ధించిన సంఘాలను పిలిచి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఉగ్రవాదం, మతోన్మాదంపై ఐక్యంగా పోరాడాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- నీలపల్లిలో తొలితరం కమ్యూనిస్టు నేతల స్మారక స్తూపం ఆవిష్కరణ

3

కులం పేరుతో ధూషించిన టిడిపి సర్పంచ్‌పై చర్యలు

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, ఆకనం బట్టు సర్పంచ్ మణిపై టిడిపి నేత జయప్రకాష్‌నాయుడు కులం పేరుతూ ధూషించడంతోపాటు చంపేస్తానని ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డారని, ఆయనపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పిన్నెల్లి సోదరులపై హత్య కేసు

- జంట హత్యల ఘటనలో ఏడుగురిపై ఎఫ్ఐఆర్

ప్రజాశక్తి-వెల్దుర్తి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడు టిడిపి నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు హత్యల ఘటనలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి సహా మొత్తం ఏడుగురిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. టిడిపిలో ఆధిపత్య పోరు వల్ల ఈ హత్యలు జరిగాయని తొలుత ప్రకటించిన అధికారులు ఆ తరువాత వైసిపి నేతల ప్రమేయంతోనే టిడిపి వారు హత్య చేసినట్టుగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

ఈ కేసులో జవిశెట్టి శ్రీనివాసరావు, తోట వెంకట్రామయ్య అలియాస్ వెంకట్రావు, తోట గురవయ్య, నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పేర్లను నమోదు చేశారు. మొత్తం ఏడుగురు నిందితులుగా ఉన్నట్టు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా.. వీరిలో నలుగురిని పోలీసులు ఆదివారమే అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి, బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లనుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా 200 టిఎంసిల గోదావరి జలాలు తరలించుకుపోయేందుకు ఎపి కుట్ర చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతుంటే సిఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గోదావరి బనకచర్లకు ఒక్క అనుమతి లేకుండానే ఎపి పనులు చేపట్టిందని ఆరోపించారు. కేంద్రం తమ చెప్పు చేతల్లో ఉందని చంద్రబాబు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన జలదోపిడీ కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైందని అన్నారు. ఏ కొత్త ప్రాజెక్ట్ చేపట్టినా నదీ పరివాహక ప్రాంతాల్లోని అన్ని రాష్ట్రాలు ఒప్పుకోవాల్సిన అవసరముందని గుర్తు చేశారు. "తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వట్లేదనీ, నీతి ఆయోగ్ సమావేశం బహిష్కరిస్తామని సిఎం గతంలో చెప్పారు. కాని శనివారం జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో రేవంత్ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఎం చేస్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేంద్రం బనక చర్ల ప్రాజెక్టను అడ్డుకోకుంటే ఢిల్లీలోని సిడబ్ల్యూసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల జోలికొస్తే ఊరుకోం

- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జోక్యం చేసుకోవాలి
- విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ జగ్గునాయుడు
- గాజువాకలో భారీ ర్యాలీ
- ఆరో రోజుకు చేరుకున్న సమ్మె



గాజువాకలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల జోలికొస్తే ఊరుకునేది లేదని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు హెచ్చరించారు. ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తక్షణమే జోక్యం చేసుకొని పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. 'ప్లాంట్‌లో నుంచి అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులందరినీ పనిలోకి తీసుకోవాలి, ఎవరినీ విధుల్లోంచి తొలగించకూడదు, మెడికల్ చెకప్‌లు నిలిపివేయాలి, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడండి - కార్మికులను రక్షించండి' అన్న డిమాండ్లతో స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న పోరాటానికి అన్ని కార్మిక సంఘాల, ప్రజల మద్దతూ ఉందని స్పష్టం చేశారు. ఈ పోరాటం విజయవంతమవుతుందని తెలిపారు. పోరాటాన్ని నిర్వీర్యం చేయాలని ఎవరు ప్రయత్నించినా వారి ఆటలు సాగవని తేల్చిచెప్పారు. కార్మిక వర్గం తలచుకుంటే ఎలా ఉంటుందో ప్రభుత్వానికి తెలుసన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 26న ఆర్‌సిఎల్ వద్ద చర్చలు జరగనున్నాయని, ఆ చర్చల్లో ఉక్కు యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తదుపరి జరిగే పరిణామాలకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి కోసం ఏ విధంగా అయితే భుజం భుజం కలిసి పనిచేస్తున్నామో, అదేవిధంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి తాము కూడా మద్దతు తెలియజేయడానికి కార్యక్రమాలను రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, వంశీ, ఉరుకూటి అప్పారావు, ఉమ్మడి అప్పారావు, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఉక్కు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. మరోవైపు స్టీల్ ప్లాంట్‌లో అక్రమ తొలగింపులను నిరసిస్తూ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరుకుంది. కార్మికులు విధులను బహిష్కరించారు. కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరంలో తమ నిరసనను కొనసాగించారు.

సిపిఎం నాయకుడిపై తప్పుడు కేసు

- టిజివి ఎస్ఆర్ఎసి పరిశ్రమ కాలుష్యంపై కవిత రాసినందుకు కక్షసాధింపు
- సిఐని సస్పెండ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర మంత్రి టిజి భరత్ తండ్రి టిజి వెంకటేష్‌కు చెందిన టిజివి ఎస్ఆర్ఎసి పరిశ్రమ కాలుష్యంపై కవిత రాసినందుకు సిపిఎం నాయకులు వి.వెంకటేశ్వర్లుపై పోలీసులు తప్పుడు కేసు పెట్టారు. కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల పాటు నిర్బంధించారు. కవితలో కేసు నమోదుకు ఆధారాలు లేకపోవడంతో టిజివి పరిశ్రమలో పని చేస్తున్న మాలిక్ బాషా అనే వ్యక్తిపై దాడి చేసి రూ.9 వేలు లాక్కున్నట్టు, మాలిక్ బాష ప్రతిఘటించడంతో గొంతునులిమినట్టు 308 సెక్షన్ కింద వెంకటేశ్వర్లుపై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారు. దీనిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తప్పుడు కేసు పెట్టిన కర్నూలు మూడో పట్టణ సిఐ శేషయ్యను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఈ మేరకు డిజిపికి, ఎస్‌పికి విన్నవించారు. ఆదివారం కర్నూలు సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్‌తో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడారు. టిజివి ఎస్ఆర్ఎసి పరిశ్రమ వల్ల ఇప్పటికే నీరు, భూమి, గాలి కాలుష్యం అయ్యాయని, ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. పరిశ్రమ విస్తరణలో భాగంగా రూ.710 కోట్లతో విష రసాయనాల ఉత్పత్తి కోసం పర్యావరణ అనుమతికి దరఖాస్తు చేసుకుందని తెలిపారు. దీనిపై ఈ నెల 14న నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అభ్యంతరాలు చెప్పడానికి వెళ్లిన ప్రజా సంఘాల నాయకులపై రౌడీ మూకలు పోలీసుల సమక్షంలోనే దాడి చేశాయన్నారు. ఇలాంటి పరిశ్రమ జనాలకు అనారోగ్య కారకమని, వాతావరణం కలుషితం అవుతుందని, జనావాసాల మధ్య పెట్టకూడదని శాస్త్రవేత్తలు చెప్పారని గుర్తు చేశారు. ఈ పరిశ్రమ కాలుష్యంపై కవిత రాసిందుకు కక్షసాధింపు చర్యలు తగవన్నారు. వి.వెంకటేశ్వర్లుపై తప్పుడు కేసు ఎత్తివేయాలని, సిఐని సస్పెండ్ లేదా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ వ్యవస్థ ఉన్నది టిజి వెంకటేష్, భరత్ ప్రయోజనాలు కాపాడడం కోసం కాదని, సిఐ టిజివి ఏజెంట్‌గా ఉండదలిస్తే రాజీనామా చేసి టిజి వెంటేష్ దగ్గర చేరాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలు జిల్లా పర్యటన రైతు బజార్ సందర్శన, పార్కుల శంకుస్థాపనలకే పరిమితమైందన్నారు. కర్నూలు జిల్లాలోని వేదవతి, గుండ్రేవుల, ప్రాజెక్టులను, ఆర్‌డిఎస్ కాలువ, మేలిగనూరు వరద కాలువ పూర్తికి నిధులు రాబట్టేందుకు టిడిపి నాయకులు మహానాడును వేదికగా మలచుకోవాలని కోరారు.

రైతులకు పెట్టుబడి సాయం జమ చేయాలి

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు తక్షణమే రూ.20 వేలు పెట్టుబడి సాయం కింద జమచేయాలని కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. నకిలీ పత్తి విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని కోరారు. పొగాకు, మిర్చి, కోకో పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

టిడ్కో ఇళ్లను అప్పగించాలి

టిడ్కో ఇళ్లు ఇవ్వకుండానే డబ్బులు కట్టాలని బ్యాంకులు లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నాయని, తక్షణమే ఇళ్లను లబ్ధిదారులకు పూర్తి రాయితీతో ప్రభుత్వం అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. 2007-08లో ఎం.ఎ.గఫూర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జగన్నాథగట్టు దగ్గర 80 వేల పైచిలుకు ఇళ్లు ఇచ్చారని, ఇప్పటి వరకూ ప్రభుత్వాలు వాటిపై శ్రద్ధ పెట్టలేదని తెలిపారు. ఆ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి నీరు, రవాణా సౌకర్యం కల్పించాలని, వాటిపై కలెక్టర్ నివేదిక పంపి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రేషన్ వాహనాలను కొనసాగించాలని, లేకుంటే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

- ఎన్‌కౌంటర్ మృతుల భౌతికకాయాల్ని బంధువులకు అప్పగించాలి
- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, పక్కన సిపిఎం రాష్ట్ర నాయకులు వి ఉమామహేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మావోయిస్ట్ పార్టీ అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు ఈ ఘటనలో మృతి చెందిన వారి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని తీర్మానించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టిన 9 అంశాలతో తీర్మానాన్ని ఆమోదించారు. నారాయణపూర్ మారణకాండతో సహా అడవుల్లో సాగిస్తున్న మారణహోమంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయించాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించి, మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఖనిజ సంపదలు, ప్రకృతి వనరులతో కూడిన అడవులను కార్పొరేట్లకు అప్పగించే ఆపరేషన్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాస్వామిక ఉద్యమానికి ఈ సమావేశం సంఘీభావాన్ని ప్రకటిస్తూ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ ఎన్‌కౌంటర్లలో మరణాలన్నీ, ప్రభుత్వ హత్యలేనని పేర్కొన్నారు. వీటిపై జ్యుడీషియల్ విచారణకు డిమాండ్ చేశారు. ఇంత దుర్మార్గంగా ఏ ప్రభుత్వం వ్యవహరించలేదన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులను ఖాళీ చేయడానికి ఈ ఆపరేషన్ కగార్‌తో కుట్ర చేస్తోందన్నారు. దీనిని సమైక్యంగా అడ్డుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం రాజ్యాంగ, చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతుందని చెప్పారు. కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై అర్బన్ నక్సలైట్ ముద్ర వేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) నాయకులు జాస్తి కిషోర్‌బాబు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు హరనాథ్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎం రామకృష్ణ, ఎస్‌యుసిఐ అమర్‌నాథ్, విరసం రాష్ట్ర నాయకులు అరసవల్లి కృష్ణ, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కె వినయ్‌కుమార్, ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవాని, ఇప్టా అధ్యక్షులు పొలారి ప్రసంగించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, మాజీ ప్రిన్సిపల్ లక్ష్మణరావు, ప్రొఫెసర్ నరసింహారావు, పులువురు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలు

- వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర-2025 పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులపాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యోగా ప్రదర్శనలు, పోటీలు, శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలు, చారిత్రక ప్రాంతాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శలు నిర్వహించి ప్రజల్లో యోగాభ్యాసం పట్ల అవగాహన పెంచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. యోగా గురువులు, శిక్షకులు, వాలంటీర్లు, అభ్యాసకులు, సాధారణ ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో నమోదు చేసుకొని పాల్గొనవచ్చని తెలిపారు. ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో థీమ్ ఆధారిత యోగా ప్రదర్శనలు, పోటీలు, సామూహిక యోగాభ్యాసం వంటి కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. 2,600 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా 1,25,000 మంది గ్రామ, పట్టణ స్థాయి శిక్షకులను తయారుచేస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షకుల ద్వారా రాష్ట్రంలో 70 లక్షల మంది ప్రజలకు యోగా శిక్షణ అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం, మే 27న పెద్దస్థాయిలో ర్యాలీ, కరపత్రాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిమన్నారు.


మాట్లాడుతున్న ఎపిఒఎ కోశాధికారి ఆర్ శ్రీనివాస్

డిఎస్‌సి స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్ల పరిశీలనలో.. క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలి

- ఎపి ఒలింపిక్ సంఘం 10వ వార్షిక సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - ఎద్యుకేషన్ (విజయవాడ)

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి స్పోర్ట్స్ కోటా టీచర్ పోస్టుల భర్తీలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలనలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అధికారులతోపాటు క్రీడా సంఘాలను కూడా భాగస్వామ్యం చేయాలని ఎపి ఒలింపిక్ సంఘం (ఎపిఒఎ) 10వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజిఎం) తీర్మానించింది. క్రీడా సంఘాల ప్రతినిధులు లేకుండా సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తే.. నకిలీ సర్టిఫికెట్‌దారులను గుర్తించడం కష్టతరమవుతుందని సమావేశం పేర్కొంది. గతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం లేకుండా స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన జరిగిందని, ఫలితంగా వందలాది మంది నకిలీ సర్టిఫికెట్‌లతో సచివాలయం ఉద్యోగాలు పొందారని సమావేశం తెలిపింది. విజయవాడలోని హోటల్ ఐలాపురంలో ఎపిఒఎ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం అధ్యక్షతన ఎపిఒఎ 10వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి సుమారు 38 క్రీడా సంఘాల రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) గుర్తింపుతోపాటు పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా జూన్ 23న అంతర్జాతీయ ఒలింపిక్ డేని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒలింపిక్ రన్‌లను ఇండియన్ ఒలింపిక్ సంఘం (ఐఒఎ) మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. అనంతరం ఎపిఒఎ కోశాధికారి ఆర్ శ్రీనివాస్‌తో కలిసి పురుషోత్తం విలేకరుల సమావేశం నిర్వహించారు. క్రీడా సర్టిఫికెట్‌ల పరిశీలనలో గతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఉండేదని, ఇటీవల ఉపాధ్యాయ నియామకంలో స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి సంబంధించిన జిఒలో ఈ అంశాన్ని తొలగించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని తక్షణమే క్రీడా సంఘాల భాగస్వామ్యంలో డిఎస్‌సి స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీలో సర్టిఫికెట్‌ల భర్తీలో క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. టీచర్ పోస్టుల భర్తీలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం ఉన్న టాప్ 9 ఒలింపిక్ క్రీడలు అథ్లెటిక్స్, ఆర్చరీ, హాకీ, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, టెన్నిస్, బాక్సింగ్, స్విమ్మింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తున్నాయని, వాటినే రాష్ట్రంలో కొనసాగించాలని కోరారు.



దేవీప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉప్పులేటి దేవీప్రసాద్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ (ఎన్‌టిఆర్)

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల సంక్షేమం కోసం రిపబ్లికన్ పార్టీ పని చేస్తున్నదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ యశ్వంత్‌రావు అన్నారు. పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా ఉప్పులేటి దేవీప్రసాద్‌ను నియమించిన సందర్భంగా విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న దేవీప్రసాద్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినట్లు తెలిపారు. ఉప్పులేటి దేవీప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. తనపై ఉంచిన బాధ్యతకు పూర్తి న్యాయం చేస్తామని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తానని వెల్లడించారు.



ఢిల్లీలో భారీ వర్షం

న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీలో ఆదివారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురియడంతో అనేక రోడ్లు, అండర్‌పాస్‌లు నీటితో నిండిపోయాయి. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వాతావరణం అనుకూలంగా లేని కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 200 విమానాలు ఆలస్యంగా నడిచాయి. 17 అంతర్జాతీయ విమానాలతోపాటు మరో 49 విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షం ప్రభావానికి నిత్యం రద్దీగా ఉండే ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్- 1 వద్ద కొంత భాగం దెబ్బతింది. ఓ భాగంలో పైకప్పు నుంచి ఒక్కసారిగా నీరు కురిసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

శనివారం అర్ధరాత్రి 2గంటల సమయంలోనూ ఢిల్లీలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, గంటకు 70-80 కి.మీల వేగంతో వీచిన గాలులతో భారీ వర్షం కురిసింది. కేవలం 30 నుంచి 45 నిమిషాల్లోనే 80 మి.మీల వర్షపాతం నమోదైంది. ఆకస్మికంగా కురిసిన భారీ వర్షానికి విమానాశ్రయం చుట్టూ నీరు నిలిచిపోయింది. తీవ్ర గాలులతో కూడిన భారీ వర్షానికి టెర్మినల్ 1 అరైవల్ ఫోర్ కోర్టు వద్ద కొంత భాగం దెబ్బతిందని, ఇతర భాగాలపై ఎలాంటి ప్రభావంలేదని అధికారులు పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా విమాన సర్వీసులపై ప్రభావం ఉండటంతో అటు ఎయిరిండియా, ఇండిగో కూడా ప్రయాణికులకు అలర్ట్‌లు పంపించాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి.

మహారాష్ట్ర చేరుకున్న నైరుతి రుతుపవనాలు : ఐఎండి

నైరుతి రుతుపవనాలు మహారాష్ట్రను చేరుకున్నాయని, రాబోయే రెండు మూడురోజుల్లో ముంబయి సహా మరికొన్ని ప్రాంతాలకు విస్తరిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఆదివారం తెలిపింది. రుతుపవనాలు ఆదివారం అరేబియా మహాసముద్రం, కర్ణాటక, గోవా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, ఉత్తర బంగాళాఖాతం, మిజోరంలోని కొన్ని ప్రాంతాలు, మణిపూర్, నాగాలాండ్‌లలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించాయని ఐఎండి పేర్కొంది. రాబోయే మూడు రోజుల్లో మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, ముంబయితో సహ మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాలు, బెంగళూరుతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలు, పశ్చిమ-మధ్య, ఉత్తర బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలు, ఈశాన్యరాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాలకు తుఫాను ముంచుకువచ్చేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వెల్లడించింది. రుతుపవనాలు ఉత్తరాదిన దేవ్‌గడ్, బెలగావి, హవేరి, మాండ్య, ధర్మపురి, చెన్నై, ఐజ్వాల్, కొహిమా గుండా పయనిస్తున్నాయని తెలిపింది. రుతుపవనాలతో మహారాష్ట్రలోని కోస్తా తీర ప్రాంత కొంకణ్ మరియు ముంబయిలలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది.

2009లో మే 23న కేరళకి చేరుకున్న రుతుపవనాలు, ఈ ఏడాది మరోసారి ముందుగా మే 24న భారత్‌ను పలకరించాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1నాటికి కేరళను తాకి, జులై నాటికి దేశం మొత్తం వ్యాపిస్తాయి.


మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో గొడవపడుతున్న సిఐ

మాజీ మంత్రి సీదిరితో పోలీసుల దురుసు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతి దురుసుగా ప్రవర్తించిన సంఘటన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు పనితీరును ప్రశ్నించడంతో నిగ్రహం కోల్పోయిన సిఐ దురుసుగా వ్యవహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన గూడ ధనరాజ్ గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గొర్రెల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న గొర్రెల శాల ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతింది. దీంతో షెడ్డును పునఃనిర్మాణం చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కొంత మంది టిడిపి నాయకులు వ్యక్తిగత కక్షతో ధనరాజ్, ఆయన భార్య లక్ష్మితో వాగ్వాదానికి దిగి గొర్రెల శాలను కూల్చే ప్రయత్నం చేశారు. బాధితులు ప్రతిఘటించగా వారిపై దాడి చేశారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఎలాంటి స్పందించలేదు. దాడి చేసిన వారు ముందుగానే పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేయడంతో బాధితులను పిలిచి రోజాంతా స్టేషన్‌లోనే ఉంచారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పోలీసుస్టేషన్‌కు చేరుకొని బాధితులకు జరిగిన అన్యాయంపై పోలీసులను నిలదీశారు. బాధితుల ఫిర్యాదును ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో మాజీ మంత్రిపై సిఐ తిరుపతి దురుసుగా ప్రవర్తించారు. మాజీ మంత్రి అని చూడకుండా వేళ్లు చూపిస్తూ ఏం తమాషా అంటూ పరుష పదజాలంతో దూషించారు. కాసేటి తర్వాత బాధితుల నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకోవడంతో వివాదం సర్దుమణిగింది. ఈ సందర్భంగా సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులు టిడిపి కూటమి నాయకులకు మద్దతుగా మాట్లాడడం సరికాదన్నారు. బాధితులకు అండగా నిలిచి వారి పక్షాన నిలబడి న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

దేశ ఆర్థిక వ్యవస్థ 4కు చేరడంపై సత్యకుమార్ హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచంలోనే దేశం నాల్గవ శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలవడంపై వైద్యారోగ్యశాఖ మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ స్థానంలో ఉన్న జపాన్‌ను కిందకి నెట్టి భారతదేశం ఆ స్థానానికి చేరిందని, ఇదే క్రమంలో త్వరలోనే జర్మనీని అధిగమించి మూడో స్థానానికి చేరుకుంటుందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోడీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ నిరంతరం ప్రగతి మార్గంలో పయనించడానికి ప్రధాని నేతృత్వంలో టీమ్ ఇండియా చేసిన కృషే కారణమని మంత్రి తెలిపారు. ఆ దిశగా దేశ ప్రజలంతా ఉమ్మడిగా కృషి చేసి వికసిత్ భారత్ ఆవిష్కారానికి నడుంబిగించాలని పిలుపునిచ్చారు.

ఉగ్రవాదాన్ని సహించేది లేదు

- పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో దేశం సహించబోదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఉగ్రవాదంతో అంటకాగుతూ దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్తాన్ దుర్నీతిని అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటుచేసిన ఏడు బృందాలతో ఎంపి పురందేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తున్న బృందం ఆదివారం పారిస్‌కు బయలుదేరి వెళ్లింది. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తమ బృందం ఫ్రాన్స్, యుకె, ఇయు, ఇటలీ, డెన్మార్క్, జర్మనీలో పర్యటించి జూన్ 8న ఇండియాకు తిరిగిరానుందని పురందేశ్వరి తెలిపారు.

ఉగ్రవాదం, మతోన్మాదంపై ఐక్యంగా పోరాడాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- నీలపల్లిలో తొలితరం కమ్యూనిస్టు నేతల స్మారక స్తూపం ఆవిష్కరణ



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

ఉగ్రవాదం, మతోన్మాదం అనేవి ఏ ఒక్క కులానికీ, మతానికీ సంబంధించినవి కాదని, వాటిని రూపుమాపడానికి ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నీలపల్లి సిద్ధార్థ నగర్‌లో నీలపల్లి గ్రామ తొలితరం కమ్యూనిస్టుల స్మారక స్తూపాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పహల్గాం ఘటనలో 26 మందిని బలిగొన్న ఉగ్రవాదులను పట్టుకోవడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌పై దాడి ప్రారంభించిన మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలతో కాల్పుల విరమణ చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసినా కాశ్మీర్ సమస్యను పరిష్కరించలేకపోయిందని తెలిపారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు అక్కడి ముస్లిములే ఆశ్రయం కల్పించి, వారు తమ తమ స్వస్థలాలకు వెళ్లడానికి తోడ్పడ్డారని గుర్తు చేశారు. భారతదేశ యువకులను అమెరికా సంకెళ్లు వేసి సైనిక విమానంలో దేశానికి పంపించినా మోడీ మాట్లాడలేదన్నారు. క్యూబా, వెనిజులా, బ్రెజిల్ వంటి దేశాలు వారి ఆత్మగౌరవం కాపాడుకోవడానికి ఆ దేశ యువకులను సొంత విమానాల్లో ఆయా దేశాలకు తీసుకెళ్లాయని తెలిపారు. ఈ రకమైన పాలనను ఎండగట్టి దేశంలో సోషలిజం స్థాపించడానికి కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం నిజాయతీగా నిలబడేది ఎర్రజెండా మాత్రమేనని తెలిపారు. ఈ సందర్భంగా నీలపల్లిలో తొలితరం కమ్యూనిస్టులు కమిడి వెంకటనారాయణ, మాత వేమనాచార్యులు, దడాల మహాలక్ష్మి, మేడిశెట్టి నీలాద్రి, కమిడి సుధాకర్ సేవలను ఆయన కొనియాడారు. దడాల మహాలక్ష్మి వారసులు దడాల ఆంజనేయులు, మాత వేమణాచార్యులు వారసులు నాగభూషణంలను ఆయన శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు చెక్కా సింహాచలం, సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి, కెఎస్.శ్రీనివాస్, మోర్త రాజశేఖర్, పలివెల వీరబాబు, సిహెచ్.రమణి తదితరులు పాల్గొన్నారు.



యూరోపియన్ వాణిజ్య కమిషనర్‌తో మంత్రి పియూష్ భేటీ

న్యూఢిల్లీ : స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కోసం యూరోపియన్ యూనియన్ వాణిజ్య కమిషనర్ మారోస్ సెఫ్కోవిక్‌తో భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ భేటీ అయ్యారు. బ్రస్సెల్స్‌లో జరిగిన ఈ సమావేశంలో ఇరు ప్రాంతాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం గురించి చర్చించారు. ఒక్క నెలలోనే రెండు సార్లు భేటీ సమావేశం కావడం విశేషం. పియూష్ గోయల్ ఈ నెల 23న వాషింగ్టన్ నుంచి బ్రస్సెల్స్‌కు వెళ్లారు. పియూష్ గోయల్‌కు స్వాగతం పలుకుతున్నామని సెఫ్కోవిక్ పేర్కొన్నారు. వాణిజ్యంలో తాము పురోగతి సాధిస్తూనే ఉన్నామన్నారు. భారత్, ఇయు ఉమ్మడి శ్రేయస్సుకు తాము కట్టుబడి ఉన్నామని.. ఇదే వేగం కొనసాగుతుందని ఆశిస్తున్నామని పియుష్ గోయల్ పేర్కొన్నారు.



వచ్చే ఐదేళ్లలో మూడు రెట్ల ఆస్తులు

- భారత వ్యాపారాలపై బ్రూక్‌ఫీల్డ్ వెల్లడి

న్యూఢిల్లీ : దిగ్గజ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ భారత్‌లో తన ఆస్తులను మూడు రెట్లు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం మౌలిక వసతులు, రియల్ ఎస్టేట్, పునరుత్పాదన ఇంధనం, ప్రయివేటు ఈక్విటీ తదితర రంగాల్లో 30 బిలియన్ డాలర్ల ఆస్తులను కలిగి ఉన్నట్లు తెలిపింది. వచ్చే ఐదేళ్లలో 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కన్నోర్ టెస్కీ తెలిపారు. భారత మౌలిక వసతుల రంగంలో విస్తృతాభివృద్ధి చోటు చేసుకుంటుందన్నారు. ఇప్పటికే మౌలిక వసతులు, రియల్ ఎస్టేట్‌లో 12 బిలియన్ల చొప్పున, ఇంధన రంగంలో 3 బిలియన్ల పెట్టుబడులు పెట్టింది. తన గ్లోబల్ ఎయుఎంను 1 ట్రిలియన్ డాలర్ల నుంచి 2 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

- సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు పరామర్శ

ప్రజాశక్తి - వన్‌టౌన్ (ఎన్‌టిఆర్)

విద్యుదాఘాతంలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ వన్‌టౌన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపాలెం గట్టు జండా చెట్టు ప్రాంతానికి చెందిన తమ్మ కృష్ణ, లలిత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిలో చిన్నవాడైన మానస్ (8) వర్షం పడుతున్న సమయంలో డాబాపైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు.

బాలుడిని పాత ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పాత ప్రభుత్వ ఆస్పత్రిలో బాలుడి మృతదేహాన్ని సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ విద్యుత్ వైర్లు ఇళ్లపై ఉన్న విషయాన్ని ఈ నెల 16న విద్యుత్ ఆదాలత్‌లో కూడా తెలిపామని, సమస్యను పరిష్కరించాలని వినతిపత్రాలు కూడా అందజేశామని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని, బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సత్యబాబు

కాప్‌స్టోన్ సర్వీసెస్ లాభాలు రెట్టింపు

న్యూఢిల్లీ : మానవ వనరుల సొల్యూషన్స్ సంస్థ కాప్‌స్టోన్ సర్వీసెస్ మెరుగైన ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 119.20 శాతం వృద్ధితో రూ.6.05 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2.76 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.141.47 కోట్లుగా ఉన్న అమ్మకాలు.. గడిచిన క్యూ4లో 30.96 శాతం పెరిగి రూ.185.27 కోట్లకు చేరింది. 2025 మార్చితో ముగిసిన ఏడాదిలో కంపెనీ నికర లాభాలు 41.93 శాతం పెరిగి రూ.17.84 కోట్లుగా చోటు చేసుకున్నాయి.

అపోలో మైక్రో సిస్టమ్స్ లాభాల్లో 8 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ (ఎఎస్ఎంఎల్) నికర లాభాలు 8 శాతం పెరిగి రూ.14 కోట్లుగా నమోదయ్యాయి. అధిక నిర్వహణ రెవెన్యూ మెరుగైన లాభాలకు దోహదం చేశాయని ఆ సంస్థ పేర్కొంది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.12.9 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ4లో కంపెనీ రెవెన్యూ 19 శాతం పెరిగి రూ.161.7 కోట్లుగా చోటు చేసుకుంది.

ఒప్పో ఎ5ఎక్స్ 5జి విడుదల

న్యూఢిల్లీ : స్మార్ట్ ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో కొత్తగా ఎ5ఎక్స్ 5జి మోడల్‌ను విడుదల చేసింది. తన ఎ సిరీస్ పోర్టుపోలియోలో ఈ కొత్త ఫోన్‌ను ఆవిష్కరించినట్లు పేర్కొంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్, 4జి ర్యామ్, 128 జిబి స్టోరేజీతో దీన్ని డిజైన్ చేసింది. మైక్రోఎస్‌డిని 1 టిబికి విస్తరించుకునే అవకాశం ఉంది. 32 ఎంపి రేర్ కెమెరా, 5ఎంపి సెల్ఫీ కెమెరాతో అందిస్తోంది. దీని ధరను రూ.13,999గా నిర్ణయించింది.





కొత్త ఇంట్లోకి దేవుని పటాలతో కుటుంబ సభ్యులతో కలిసి వెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కుప్పంలో సిఎం గృహప్రవేశం

- అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో :

తిరుపతి జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ పరిధిలోని శివపురం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైభవంగా ఆదివారం నూతన గృహప్రవేశం చేశారు. ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు నారా లోకేష్, కోడలు బ్రాహ్మణిలతో కలిసి చేసుకున్న ఈ వేడుకకు కుప్పం నియోజకవర్గ ప్రజలు తరలివచ్చారు. గహప్రవేశం చేసిన ఇంటిలోనే కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి బస చేశారు. శివపురం వద్ద మూడేళ్ల క్రితం రెండు ఎకరాలు స్థలాన్ని చంద్రబాబు కొన్నారు. ఆ స్థలంలో ఇంటిని నిర్మించి ఆదివారం గృహప్రవేశం చేశారు. కొత్త ఇంట్లో కోడలు బ్రాహ్మణి పాలు పొంగించిన అనంతరం కుటుంబతో కలిసి సత్యనారాయణ వ్రతం చేశారు. గృహప్రవేశం సందర్భంగా కుప్పం నియోజకవర్గ ప్రజలకు చంద్రబాబు విందు ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు మనవడు దేవాన్ష్ పరీక్షల కారణంగా హాజరు కాలేదు. నందమూరి కుటుంబ సభ్యులు కూడా హాజరు కాలేదు.

గృహప్రవేశం అనంతరం సిఎం చంద్రబాబు నాయుడు నియోజకవర్గం ప్రజల నుంచి సమస్యలతో కూడిన అర్జీలు స్వీకరించారు. కొత్త ఇంటిలోనే కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో నియోజక అభివృద్ధిపై సమావేశమయ్యారు. టిడిపి కుప్పం శ్రేణులతో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దుగ్గిమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, ఎన్ అమర్నాథరెడ్డి, డాక్టర్ మురళీమోహన్, పులివర్తి నాని, గాలి భాను ప్రకాష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ ఒత్తిడితోనే తప్పుడు కేసులు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

టిడిపిలో ఆధిపత్య పోరు వల్ల పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో ఆ పార్టీకి చెందిన నాయకులు హత్యకు గురైతే ఆకస్మికంగా వైసిపి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిపై తప్పుడు కేసు బనాయించారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. హత్య జరిగిన వెంటనే టిడిపిలో ఇరు గ్రూపుల మధ్య ఉన్న విభేదాల వల్ల జంట హత్యలు జరిగాయని ఎస్‌పి శ్రీనివాసరావు ప్రకటిస్తే.. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాత్రం తమ పార్టీ నాయకులకు వైసిపి వారితో సంబంధాలు ఉన్నాయని చెబుతూ పిన్నెల్లి సోదరులపై హత్య కేసు నమోదు చేసేలా అధికారులపై ఒత్తిడి చేశారని అంబటి ధ్వజమెత్తారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆదేశాలతో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఒత్తిడితో ఈ అక్రమ కేసు నమోదైందన్నారు. టిడిపి నేతల ఒత్తిడితో గతంలో మరణించిన తోట చంద్రయ్య కుమారుడు ప్రమేయం లేదని తొలుత ప్రకటించిన అధికారులు ఆ తరువాత ఎమ్మెల్యే ఒత్తిడితో పిన్నెల్లి సోదరులను హత్య కేసులో నిందితులుగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అన్నారు. జంట హత్య కేసులో ప్రధాన నిందితుడు వెంకట్రామయ్య వాడిన కారు వెనుక పసుపు రంగులో జెబిఆర్ (జూలకంటి బ్రహ్మారెడ్డి) అనే స్టిక్కర్ ఉన్న విషయాన్ని మరచి ఈ హత్యను వైసిపి వారు చేశారని చెప్పడం సిగ్గుచేటన్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ)



- దాసరి ఆంజనేయులు
మెథడాలజీ సబ్జెక్టు నిపుణులు,
సెల్ : 9490082528

నిరంతర సమగ్ర మూల్యాంకనం (CCE)

CCE -Continues Comprehensive Evaluation.

- భారతదేశంలో నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని ప్రవేశపెట్టాలని మొదటిసారిగా పేర్కొన్నది - కొఠారి కమీషన్
- 1986 జాతీయ విద్యా విధానం కూడా నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని ప్రవేశపెట్టాలని సూచించింది.
- 1992 జాతీయ సలహా సంఘం కూడా నిరంతర సమగ్ర మూల్యాంకనం ఆవశ్యకతలను తెలిపింది.
- NCF-2005 నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రవేశపెట్టాలని సూచించింది.
- పై అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఉచిత నిర్బంధ విద్యాహక్కు-2009 చట్టంలో నిరంతర సమగ్ర మూల్యాంకనానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు.
- మూల్యాంకనం కేవలం రాత పరీక్షకు మాత్రమే పరిమితం కాదు. ఇది సామర్థ్య ఆధారితంగా విద్యాప్రమాణాల సాధనను పరిశీలించేదిగా ఉండాలి.
- జ్ఞానం, నైపుణ్యం, వైఖరులు, విశ్లేషణ సామర్థ్యాలు, విలువలు, నైతిక ప్రవర్తనావళి మొదలైన అంశాలన్నింటిని బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా మూల్యాంకనం చేయాలని విద్యాహక్కుచట్టం-2009 అభిప్రాయపడింది.
- మూల్యాంకనంలో మౌఖిక పరీక్షకు కూడా స్థానం ఉండాలి. విద్యార్థి తన ఆలోచనలను, భావాలను వ్యక్తీకరించటానికి. సొంతంగా రాయడానికి అవకాశం కల్పించేదిగా ఉండాలి.
- పిల్లల నైపుణ్యాలను విశ్లేషణాశక్తిని, సృజనాత్మకతను మాపనం చేసేందుకు అనువుగా ఉండాలని ఎన్‌సిఎఫ్ 2011 పేర్కొంది.
- విద్యాహక్కు చట్టం అధ్యయనం 5, సెక్షన్ 29, సబ్ సెక్షన్ 2 ప్రకారం విద్యార్థి ప్రగతిని నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయాలని నిర్దేశించింది.

నిరంతర సమగ్ర మూల్యాంకనం - లక్ష్యాలు :

- పాఠ్య, సహ పాఠ్యాంశాలనే విభేదం లేకుండా పాఠ్యాంశాలు గానే భావించాలని జాతీయ ప్రణాళిక చట్టం-2011 సూచించింది.
- పిల్లలు జ్ఞానాత్మక, భావావేశ, మానసిక చలనాత్మక నైపుణ్యాలను పెంపొందించటం.
- బట్టీ పట్టడం, సమాచారాన్ని గుర్తు పెట్టుకోవడమనే తరగతి గది ప్రక్రియల స్థానంలో విశ్లేషణాత్మక ఆలోచనలతో సొంతంగా జ్ఞాన నిర్మాణాన్ని చేసుకోవటాన్ని ప్రోత్సహించటం.
- విద్యార్థుల ఆలోచనా విధానాన్ని మెరుగుపర్చటం
- బోధనాభ్యసనలో విద్యార్థి కేంద్రీకృత విధానాలను అమలు చేయటం

నిరంతర సమగ్ర మూల్యాంకనం-అర్థం

నిరంతరం : నిరంతరం అంటే బోధనాభ్యసన ప్రక్రియ ఏదో ఒక సంఘటనకో సందర్భానికో పరిమితం కాకుండా అభ్యసనాలన్నింటిని ఎల్లప్పుడూ పరిశీలించటం.

సమగ్రం : సమగ్రం అంటే పిల్లల సర్వతోముఖాభివృద్ధి, పిల్లల శారీరక, మానసిక, నైతిక జ్ఞానాత్మక రంగాలు అభివృద్ధి అని అర్థం.

నిరంతర - సమగ్ర మూల్యాంకనం - రకాలు :-

నిరంతర సమగ్ర మూల్యాంకనం 2 రకాలుగా చేస్తారు.

1.నిర్మాణాత్మక మూల్యాంకనం
2.సంగ్రహణాత్మక మూల్యాంకనం

సహపాఠ్య విషయాలు:



1.కళలు - సాంస్కృతిక విద్య (సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు లేదా భాషా ఉపాధ్యాయుడు):

- రంగులు వేయటం, చిత్రాలు గీయటం, అలంకరణ, నమూనాలు తయారు చేయటం, బొమ్మలు తయారీ.
- వొరిగామి తాన్‌గ్రాం, కుట్లు, అల్లికలు
- పాటలు పాడటం, వాయిద్యపరికరాలు వినియోగం
- స్థానిక కళారూపాలు, నాటకీకరణ, పాత్రపోషణ

2. ఆరోగ్యం - వ్యాయామ విద్య (గ్రాజు లేదా సైన్సు ఉపాధ్యాయుడు) :

- ఆటల్లో పాల్గొనటం, ఆటను నియమానుసారంగా నిబంధనల ప్రకారం ఆడటం
- క్రీడా స్ఫూర్తి ప్రశంసలు తెలియజేయటం
- యోగా, జ్ఞానం శారీరక వికాసం, వ్యక్తిగత పరిశుభ్రత
- ఆరోగ్య ఆహార అలవాట్లు, పరిసరాల పరిశుభ్రత

3. పని అనుభవం - కంప్యూటర్ విద్య (భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు లేదా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు)

- నమూనాలు, వస్తువుల తయారీ, పనిముట్ల సామాగ్రి వినియోగం.
- వ్యక్తుల సేవల వినియోగం, ఉత్సవాల్లో పాల్గొనటం, బాధ్యతలను నిర్వహించటం
- కంప్యూటర్ ఆధారంగా నేర్చుకోవటం
- కంప్యూటర్ వినియోగించటం

4. విలువల విద్య - జీవనైపుణ్యాలు (భాషా ఉపాధ్యాయుడు లేదా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు):

- మంచి, చెడు విచక్షణా జ్ఞానము, సత్ప్రవర్తన.
- రాజ్యాంగ విలువలు, సంఘీభావం, సోదరభావం, సమయాభావం
- సహనము, దయ, సహనుభూతి, వ్యక్తిగత విలువలు
- ఒక్కొక్క అంశానికి 5 మార్కులు కేటాయిస్తారు. 4 x 5=20 మార్కులు.
- ప్రతి సబ్జెక్టులో ఉండే అన్ని విద్యా కనిష్ఠ ప్రమాణాలను మదింపు చేయాలి.
- ఉపాధ్యాయుడే సొంతంగా ప్రశ్నాపత్రాన్ని తయారుచేయాలి.
- ప్రాజెక్టు పనులను సంగ్రహణాత్మక మూల్యాంకనంలో ఇవ్వరాదు.

నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పిల్లలు సాధించిన ప్రగతిని 5 పాయింట్ల స్కేలులో మాపనం చేయాలి.

$FA_1 + FA_2 + FA_3 + FA_4$

10+ 10+ 10+ 10= 40

$SA_1 + SA_2$

30% 30% = 60

4.నిర్మాణాత్మక మూల్యాంకనాల సగటు 20 శాతం

2. సంగ్రహణాత్మక మూల్యాంకనాల సగటు 80 శాతంగా తీసుకుని సిసిఇ రికార్డులో నమోదుచేస్తారు.

ప్రయోజనాలు :

1. విద్యార్థి బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా నేర్చుకున్న అంశాలను మొత్తంగా, సమగ్రంగా మదింపు చేయడానికి ఉపయోగపడుతుంది.

2. కోర్సు పూర్తయిన తర్వాత లేదా నిర్దేశిత పాఠ్యప్రణాళిక పూర్తయిన తర్వాత పిల్లల సాధనను పరీక్షించడానికి ఉపయోగపడుతుంది.

3. ఉత్తీర్ణులయ్యారా ? లేదా ? అని గుర్తించడానికి ఉపయోగపడుతుంది.



- భోధనాభ్యసన ప్రక్రియ విద్యార్థి కేంద్రీకృతంగా సాగేందుకు తోడ్పడుతుంది
- భయరహిత వాతావరణంలో సహజంగా, స్వేచ్ఛగా మదింపు చేయడానికి ఉపయోగపడుతుంది.
- నిర్మాణాత్మక మూల్యాంకనం వల్ల విద్యార్థుల అభ్యసనలోని లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి సవరణ బోధనాకృత్యాలు (Remedial Activities) నిర్వహించడానికి వీలుకలుగుతుంది. అభ్యసనను వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుంది.
- ఉపాధ్యాయుడు, విద్యార్థుల ప్రగతిని నిరంతరం పరిశీలించేందుకు ఉపయోగపడుతుంది.
- బోధనాభ్యసన జరుగుతున్న సమయంలో నిరంతరం పరిపుష్టిని ఇస్తూ ఉపాధ్యాయునికి, విద్యార్థికి తమను తాము సరిచేసుకొనే నీలు కల్పిస్తుంది.
- విద్యార్థులు తమకు తాము భాగస్వాములై నేర్చుకోవడంలో ప్రధాన భూమిక వహిస్తుంది.

పద్ధతులు, విధానాలు మొదలైనవన్నీ నిరంతరం మార్చుకోవడానికి వీలుండేటట్లు సరళత కలిగి ఉంటుంది.

సంగ్రహణాత్మక మూల్యాంకనానికి విద్యార్థుల్ని సంసిద్ధులుగా చేస్తుంది.

వయోగశాల, ప్రాజెక్టు పనులు జట్లలో నిర్వహించడం వల్ల అభిప్రాయాలను పంచుకోవడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం జరుగుతుంది. దీనివల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

ఇది బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా మాత్రమే పరిగణించబడుతుంది.

సంగ్రహణాత్మక మూల్యాంకనం

- జ్ఞానాత్మక, భావావేశ, మానసిక చలనాత్మక నైపుణ్యాలను మదింపు చేయటం.
- పాఠ్య, సహపాఠ్య విషయాలను మదింపు చేయటం.
- రాత విషయాలతో పాటు, మౌఖిక అంశాలను కూడా మదింపు చేయటం.
- శారీరక, మానసిక, నైతిక, జ్ఞానాత్మక రంగాల అభివృద్ధి అని అర్థం.
- శారీరక, మానసిక, నైతిక, ఆరోగ్య, వ్యాయామ, కళలు, సంగీతం, పని అనుభవం, కంప్యూటర్ విద్య, నాయకత్వ లక్షణాలు, జీవ నైపుణ్యాలను మదింపు చేయాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం అంటే కొంతకాలంలో నిర్దేశించిన పాఠ్యాంశాలలో పిల్లలు ఏ మేరకు విద్యా ప్రమాణాలను సాధించారో తెలుసుకోవటానికి ఉద్దేశించింది.
- సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించే సమయం, తేదీని పిల్లలకు ముందే తెలియజేయాలి. 'రాత పరీక్ష 2 1/2 గంటలపాటు నిర్వహిస్తారు. ఇందులో మౌఖిక రాత పరీక్షలుంటాయి. రాత పరీక్ష 90 మార్కులు, మౌఖిక పరీక్ష 10 మార్కులు కేటాయిస్తారు.
- పాఠ్య విషయాలకు 80 శాతం మార్కులు, సహపాఠ్య విషయాలకు 20 శాతం మార్కులు కేటాయిస్తారు.

సాధారణంగా ఎసెస్మెంట్ (నిర్మాణాత్మక మదింపు) తరువాత ఒక సంగ్రహణాత్మక మదింపును చేపడుతారు. ఒక సంవత్సర కాలంలో రెండు సంగ్రహణాత్మక మదింపులు చేస్తారు. అవి.

1. SA.1 (October Or November)
SA.2 (March or April)

మొత్తం 10 అంశాలను పరీక్షిస్తాయి. 6 పాఠ్యవిషయానికి సంబంధించినవి. 4 సహపాఠ్య విషయాలకు చెందినవి.

పాఠ్య విషయాలకు 80 శాతం మార్కులు, సహపాఠ్య విషయాలకి 20 శాతం మార్కులు.

మదుపు చేయాల్సిన పాఠ్యాంశాలు :

1.తెలుగు 2. ఇంగ్లీషు 3. హిందీ 4. గణితం 5. విజ్ఞాన శాస్త్రం 6. సాంఘిక శాస్త్రం

4. విద్యార్థుల మధ్య ఆరోగ్యవంతమైన పోటీ కల్పించటం

5.విషయ నిష్ణాతులు నిర్ధారించబడిన ప్రమాణాలపై ఆధారపడి ఉండి మొత్తం మీద నిర్ధారిస్తుంది.

6.నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని సొంత మాటల్లో, రాతపూర్వకంగా తెలియజేయటానికి అవకాశం ఉంటుంది

సిసిఇ మార్కులు, గ్రేడులు, స్కేలు :

సిసిఇలో 2 రకాల స్కేలులు ఉంటాయి

1.5 పాయింట్ స్కేల్ (1-5)
2.8 పాయింట్ స్కేల్ (6-10)

5 పాయింట్ స్కేలు

మార్కులు	గ్రేడ్	వివరణాత్మక సూచనలు
91-100	ఎ	అత్యున్నత ప్రతిభను కనబర్చారు
71-90	ఎ	చాలా బాగుంది
51-70	బి	బాగుంది
41-50	బి	ఫరవాలేదు
0-40	సి	నామమాత్రంగా చేయగల్గుతున్నారు ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

8పాయింట్ స్కేలు

మార్కులు	గ్రేడ్	పాయింట్లు	వివరణాత్మక సూచనల
91-100	ఎ1	10	Outstanding performance
81-90	ఎ2	9	Exlent
71-80	బి1	8	Have good leadership qualities
61-70	బి2	7	Shows interested
51-60	సి1	6	Have required content Knowledge
41-50	సి2	5	Little knowdledge
35-40	డి	4	Poor performance
35 కంటే తక్కువ	ఇ	3	Not participated

సహపాఠ్య విషయాలు గ్రేడింగ్

మార్కులు	గ్రేడింగ్
4.1-5	ఎ
3.1-4	బి
2.1-3	సి
1.1-2	డి
0-1	ఇ

కనీస అర్హత పొందటానికి కనీస గ్రేడ్ డి.

రేపు : ఎన్‌సిఎఫ్ 2005



"సామ్యవాద పథమ్ము
సామ్యమైన విధమ్ము
సకల సౌఖ్యప్రదమ్ము
ఓ కూనలమ్మ!"
- ఆరుద్ర



నువ్వెళ్ళిపోయాకే ...

నువ్వెళ్ళిపోయాకే గానీ
నువ్వొచ్చిన సంగతి తెలియదు
నువ్వున్నప్పుడున్న ఉనికి
నువ్వు లేనప్పుడే,
ఒక్కొక్కటిగా బయటకొస్తుంది
పతాక శీర్షికవై నింగిని ముద్దాడినప్పుడు
నీ తడి జ్ఞాపకాలకు
ఈ నేలంతా తవ్వుకుంటుంది
నీ పాదముద్రలు పడిన చోటల్లా
బతుకు పాఠాలకు
కొత్త పుటలు చేరుతాయి
పాటల్లో ప్రవాహమైనప్పుడు
కూడు గూడులైన నీ జ్ఞాపకాలు
మరోసారి కళ్ళు చెమ్మగిల్లుపిస్తాయి
పిడికిళ్ళలో నినాదమైనప్పుడు
గుండెల్నీ రాటుదేలుస్తాయి
నువ్వు వదిలిన ఆశయమేదో
ఏ ఆకలి కడుపులోనో
మళ్ళీ పురుడు పోసుకుంటుంది
ఆకలి ఉన్నన్నాళ్ళు
నీ ఆశయాలైతే ఉంటాయి
లేకున్నా..
రాజ్యం తలబొప్పిగా
నీ పేరైనా ఉంటుంది!

- వినోద్ కుత్తుం
96343 14502

ఉపాధి ఉద్యమం

కొందరి కూలీల కన్నీళ్ళని తాకాను
పనుల కొరత గాథలై వినిపించాయి
ఇళ్ళ నిర్మాణాలు మూలుగుతూ
అమ్మకాలు వణుకుతూ
పనుల కోసం కూలీలు
దిక్కులు చూస్తున్నారు

ఇప్పుడు బతుకంటే యుద్ధమైంది
ప్రాంతమేదైనా
పోరాటం అనివార్యమైంది

ఇటుక మోసే ఆడోళ్ళు సైతం
ఇళ్ళ ను చెక్కే తాపీ జీవితాలు సైతం
దీనగాథలు వినిపిస్తున్నాయి.
కలల సౌధాలు నిర్మించే
కార్మికుల కన్నీటి వ్యథలెన్నో
ఎదురవుతుంటాయి
పనులు కరువై
వలసలు ఊపందుకున్నాయి

రాజ్యమా ...
పనులు కల్పించు
పరిశ్రమలు వెలిగించు
చీకటి బతుకులకి గుప్పెడు మెతుకులు
దొరికే దారి చూపించు.

ఇక వ్యవస్థ మారాలి
పన్నులు ప్రజా సంక్షేమాన్ని నడపాలి
స్వయంశక్తి వెలిగేలా
సంస్కరణల దిద్దుబాటు జరగాలి
కడుపు మండే కూలీల గొంతు
ఉపాధి ఉద్యమమై మోగాలి!

- గవిడి శ్రీనివాస్, 70192 78368

యుద్ధానంతర ప్రశ్నలు

యుద్ధం అంటే ఒకరి గెలుపు
మరొకరి ఓటమి అన్నది నిజం కానే కాదు!
యుద్ధం అంటే అన్నీ గాయాలే!
బాంబుల మోతలు, పసిపిల్లల ఆర్తనాదాలు
రక్తపు వాసన, చీకట్ల మధ్య
నిస్సహాయంగా వెళ్లిపోయే చివరి శ్వాసలు
శిథిలాల్లో కలసిపోయే బతుకులు!
ఇదే కదా యుద్ధం అంటే!

యుద్ధం కావాలని ఎవరూ కోరుకోరు!
కానీ, ఒకసారి మొదలయ్యాక మాత్రం
విజయమే కావాలనుకుంటారు ఎవరైనా!

ఏమైందో ఏమో గానీ
నేలరాలిన శరీరాల సాక్షిగా
ఎన్నో సమాధానాల్లేని ప్రశ్నల్ని
మన ముందు వదిలేసి,
యుద్ధం ముగిసింది!

శత్రువు చాలా బలహీనంగా ఉన్నాడని
తనని చావుదెబ్బ కొట్టబోతున్నామని,
ఇక ప్రపంచపటం మీద కనపడడని,
మనం విజయానికి చేరువయ్యామని,
చెప్పిన పాలకులు
ఆకస్మాత్తుగా వెనకడుగు వేయడానికి
ఏ పెద్దన్న వత్తిడి తెచ్చాడో చెప్పరు!

ఇప్పటికైతే శాంతి జెండా
ఎగురుతోంది కానీ
గర్వంతో కాదు, గాయాల బాధతో!
దానిపై చిందిన రక్తం
ఇంకా ఎర్రని సింధూరంలా
మెరుస్తూనే ఉంది!
పాలకులకు కావలసింది అధికారమే,
అందుకే ప్రజల కళ్ళకు గంతలు కట్టి
దేశభక్తి అంటూ పూనకాలెత్తుతారు!
వాళ్ళేమి నష్టపోరు!
కష్టాలు, నష్టాలు, త్యాగాలు
ఏవైనా ఎన్నైనా ఎప్పుడూ సామాన్యులవే!

మా ధిక్కారం యుద్ధంపై కాదు!
కారణాలు చెప్పని మీ మౌనం,
ఒత్తిడికి లొంగిన మీ పాలక విధానం,
మీ దేశభక్తి ముసుగు వీటి పైనే!

మరణించిన వారి
త్యాగాలకు విలువ లేకుండా చేసి,
దేశ ప్రతిష్టను దిగజార్చిన మీ ఒప్పందం,
మీ పతనానికి నాంది అయ్యేలా
మేము ఈ ప్రశ్నలను
విసురుతూనే ఉంటాం
కవితల్లా కాదు, నిప్పుల్లా!

- ఇడదాసుల తిరుపతి రాజు
98480 04156

మనసు పొరలను విప్పి చూపే కవిత్వం

పుస్తకం

కవిగా, రచయితగా, నవలా కారుడిగా, విమర్శకుడిగా, 'కవితావరణం' నిర్వాహకుడిగా పలమనేరు బాలాజీ తెలుగు పాఠకులకు సుపరిచితం. 2012 - 2024 మధ్య రాసిన కవితలను ఇటీవల 'లోపలేదో కదులుతున్నట్టు' కవితా సంపుటిని వెలువరించాడు. దీనిని 'నవ్విన ధాన్య రాశి' కథా రచయిత, 'మల్లెలు తూరుపెత్తిన వేళ' కవితా సంపుటిని వెలువరించిన కీర్తిశేషులు సి.వేణుకు అంకితమిచ్చాడు. ఇందులో ఉన్న 64 కవితలకు 'ప్రేమతో' ముందుమాటలు రాసిన వారు కె.శివారెడ్డి, ఎన్.వేణుగోపాల్, వాడ్రేవు చిన వీరభద్రుడు, యాకూబ్; 'స్నేహంగా' రాసిన వారు బాల సుధాకర్ మౌళి, తగుళ్ల గోపాల్, సుంకర గోపాల్, పల్లెపట్టు నాగరాజు.

శివారెడ్డి తన ముందుమాటలో 'నువ్వు ఎంత గొప్ప విషయాలు చెప్పినా, అది కళ కాకపోతే, కవిత్వం కాకపోతే వ్యర్థం. పాఠకుడిని తాకే శక్తి కోల్పోయి ముడి ఇనుము ఆయుధంగా మారదు అన్నమాట' అని కోట్ చేస్తూ, బాలాజీ ఎక్కడ ద్రవీభూతమవ్వాలో, ఎక్కడ ఘనీభూతం కావాలో' తెలిసిన కవి అంటారు. ఈ సంపుటిలో కనీసం 40 కవితల్లో మనిషి తనం ఇతివృత్తంగా ఎంచుకుని రాసినవి అంటూ ఒక ఉదాత్త మానవీయ పునాదిని సంభావిస్తూ పాఠకులకు ఆ పునాదిని సందేశంగా అందిస్తున్నది ఈ సంపుటి' అన్నారు. మనిషి కోసం అన్వేషణ అంటూ వాడ్రేవు చిన వీర భద్రుడు "టైలరు, చొక్కా కుడుతున్నప్పుడు మిషన్‌కు ఎక్కించిన దారం లోపలికి పోయి లోపలి దారాన్ని పైకి లాగినట్లు, కవికి బయట కనిపించే మనిషి అతన్ని స్పందింపజేసినప్పుడు, అతడు తన లోపలి మనిషిని బయటకు తీసుకొస్తాడు" అని చక్కగా ఉపమించారు. ఇంత శక్తివంతమైన కవితా వాక్యాలు తాను ఒకప్పుడు వాల్ట్ విట్మన్‌లో మాత్రమే చూశాను' అంటూ కితాబిచ్చారు. యాకూబ్ ... ఈ కవితలు చదివాక, కవిత్వానికున్న బలమేమిటో, సమాజానికి కవిత్వం ఎంత అవసరమో మరోసారి పునరాలోచించే సందర్భం ముందుకు వస్తుందంటారు. నిశ్చలంగా ఉన్న నీటిలో బండరాయి పడితే ఎలా నీళ్లలో ప్రకంపనాలు వస్తాయో, ఈ కవితలు పాఠడిలో అలాంటి కంపనాలు సృష్టిస్తాయి' అంటారు. 'మనిషిని గురించి కలవరింత' అంటూ సుధాకర్ మౌళి- 'కవి, బాలాజీ మనిషితనపు సకల వైశాల్యాలను కొలవగలిగాడంటారు. 'నిర్వచన స్థాయికి ఎదిగిన కవిత్వం బాలాజీ కవిది' అన్న విషయాన్ని ఈ సంపుటి మూలంగా బలంగా తేట పరుస్తుంది అంటారు తగుళ్ల గోపాల్.



'లోపలేదో కదులుతున్నట్టు' శీర్షిక గల ఈ సంపుటిలోని మొదటి కవితలో బాలాజీ, 'ఎంతగా మనిషి విధ్వంసం అవుతున్నా/ మనసు లోపలి శిశువుల్ని/ పదిలంగా కాపాడుకునే వాళ్ళు కదా/ కావాలిప్పుడు/.. లోపలేదో ఉన్నప్పుడు/ లోపలేదో కలవర పెడుతున్నప్పుడు/ కదిలించి కదిలించి కరిగిస్తున్నప్పుడు/ తప్పకుండా మనుషులు బ్రతికే ఉంటారు/". మరో కవితలో 'ఇప్పుడు అన్ని అమ్మకపు వస్తువులే/ స్త్రీ పురుషులు అన్న విభజన లేదు/ ఉన్నది ఇద్దరే!/ అమ్మకందారులు, కొనుగోలుదారులే/ సృజనకారుడే, మరణం తర్వాత, తన తరం తర్వాత కూడా/ కొత్త ఊపిరి అవుతాడు/. ఇద్దరూ ఇద్దరే' కవితలో అవసరం వచ్చిన అన్ని వేళల్లో/ ఆమె వంటిల్లు అవుతుంది/ ఏ ఇంట్లో అయినా మూతబడని వంటిల్లు ఆమె!/ పనులెప్పుడూ ఇద్దరివీ అయితేనే/ ఏ ఇల్లైనా, జీవితం అయినా/ ఇద్దరిదీ అవుతుంది"/ అంటారు. బతికించే మాట ఒకటి కావాలి' అంటూ నాకు ఒక మనిషి మాట మనసు కావాలి/ మనసుతో మాట్లాడే మనిషితనం కావాలి, మనిషోకరు కావాలి/ అంటాడు కవి. ఖాళీ ఇల్లు- ఖాళీ మనుషులు' కవితలో దూరాల్ని విశాలం చేసుకుంటూ/ ఎవరి లోకంలో వాళ్ళు/ ఎవరెవరి నీడల్లో, మాటల్లో, ముసుగుల్లో/ నమ్ముకుని అట్లా లోకాంతరంలో బ్రతికేస్తారు/ ఛార్జ్- రీఛార్జ్‌ల మధ్య/ నిద్రల్నీ మెలుకువల్నీ గాలికి వదిలి, హడావుడిగా బతికేస్తారు/ వాళ్ళని ప్రేమించే వాళ్ళని ప్రేమించరు/ ప్రేమించల్సిన వాళ్ళనీ ప్రేమించరు/ ప్రేమించడమే జీవించడమంటూ.. ఫేస్బుక్లో అకౌంట్ ప్రారంభించినంత సులభం కాదు కదా ప్రేమ"/ అని కవితని ముగిస్తారు. 'చిగురించే మనుషులు' కవితలో.. 'భాషలు మాటలు నటనల జాతరలోంచి బయటపడినప్పుడే/ మనుషులు మొలకెత్తుతారు మనుషులు చిగురిస్తారు/ ప్రవహిస్తారు పరవశిస్తారు/ మనుషులు మనుషులు కావటమే మనిషి చరిత్ర/ అన్నది ఈ కవితకు ముగింపు. ఇలా హృదయాన్నే కవితలు ఎన్నో ఈ పుస్తకం నిండా పరిమళిస్తాయి.

'ప్రశ్నలు జవాబులు' అన్న కవితలో "ముందుమాటలు వగైరాలు అవసరం లేని పుస్తకాలు పిల్లలు/ అంటూ వాన చినుకులు, సీతాకోకచిలుకలు గాలిపటాలు కాగితం పడవలే/ పిల్లల ఆనవాళ్లు. ఆదివారాలు/ పండుగలు స్వేచ్ఛ స్వాతంత్రం ఆనవాళ్లే లేనివి- హాస్టళ్లు./ మార్కులు జవాబులే తప్ప ప్రశ్నలు తెలియని పిల్లలు/.. ప్రశ్న, జవాబులు ఉరితాళ్ళౌతున్న కాలం"/ అని విచారం వ్యక్తం చేస్తారు. మరొక కవితలో "నదులు లాంటి, ప్రవాహాలు లాంటి నలుగురు మనుషులు/ కలిసే కూడళ్ళని నగరాలు అంటారు. నగరాల్లో అందరూ ఉంటారు/ కొందరే మాట్లాడగలరు/ వాళ్లే నదులంత మహనీయులు/.. అనడం చేదు నిజం కదా!. 'వాంగ్మూలం' అన్న కవితలో ..జ్ఞాపకాలు మరణించాకే మనుషులు మరణిస్తారు/ జ్ఞాపకాలు మరణిస్తేనే మనుషులు మరణిస్తారు/ మనుషులు మనసులు పోగొట్టుకోవడమే మరణం/ మనుషులని జ్ఞాపకాలని పోగొట్టుకోవడమే మరణం/ అనడం సరికొత్తదిగా కనబడుతుంది.

ఈ సంపుటిలో 'ఆమె నిద్ర' అనే కవిత చాలా విలక్షణమైనది. రోజంతా కష్టపడే వాళ్ళు/ ఎట్లా నిద్రపోతారో చూడాలని../ ఒక్కరోజైనా వాళ్ళు, ఇంట్లో మగాళ్ళ కన్నా ముందు నిద్రపోతే కదా?/ వాళ్ళ కన్నా ముందు నిద్రలేచి/ వాళ్ళ కన్నా ఆలస్యంగా నిద్రించే రోజు/ ఒకటి రావాలని. నిరంతరం ప్రేమించి శ్రమించే /వాళ్ళ నిద్ర- సోమరిపోతు ప్రపంచానికి ఒక మెలుకువ!" అని ముగిస్తారు ఎనలేని అభిమానంతో. పాయసం కంటే తీయనైన కవిత- "పాయసం". 'పాతబడే కొద్దీ పుస్తకాలు కొత్తగా అర్థం అయినట్లే/ ఆమె పూర్తిగా పాతబడిపోయిన తర్వాతే/ ఆమె సరికొత్తగా సాక్షాత్కరిస్తుంది../ ఆమె ప్రేమ.. ఆమె, అర్థమయ్యేది" /అనడం మరొక నవ్యమైన అభివ్యక్తి.

'ప్రతిజ్ఞ' కవిత మరో భిన్నమైన కవిత. "..ఆమె అన్ని వేళల్లో వంటిల్లు అవుతుంది/ ఏ ఇంట్లో అయినా ఎప్పటికీ మూతబడని వంటిల్లు ఆమె/ అతడు- ఆమె కాలేకపోయినా/ క్షమించి ప్రేమించి, ప్రేమించి క్షమించి/ ఆమె- అతడవుతుంది/ ప్రేమ ఉన్నప్పుడే స్వేచ్ఛ ఉన్నప్పుడే/ అతడికి ఆమె- ఆమె అతడికి అర్థం అవుతారు/ అధికారాల్లో హక్కుల్లో అందరూ సమానమైనప్పుడే మనుషులందరూ సమానం అవుతారు/. "పాప చేతుల్లో ఉన్నప్పుడు" కవిత ఎన్నిసార్లు చదివినా తృప్తినివ్వని కవిత. కళ్ళనిండా చేతుల నిండా మొహం నిండా నవ్వులే నవ్వులు/ పాప చేతుల్లో ఉన్నప్పుడే బ్రతుకంటే ఏమిటో తెలుస్తుంది/ అప్పుడు మనం మనుషులం అని, మనకే తెలిసి వచ్చేది/ తాత అని ప్రేమగా పిలిపించుకున్న వాళ్ళకి ఇందులో ఉన్న స్వారస్యం వాత్సల్యం బంధం అనుబంధం అనుభవైక వేద్యం. ఎదుటి మనుషులెట్లున్నా, మనం ఎట్లుండాలి? చేతులెత్తి మొక్కడం మానేసి చెయ్యెత్తి బతకాలి/ అని చెబుతూ 'బ్రతుకు ఒక ఉత్సవం లాగే బతికి చూపించాలి' అని.. 'మనుషులు ఎట్లున్నా" అనే కవిత మనకు ఒక దిక్సూచిలా పనికొస్తుంది. 'పురాతన మానవుడు' కవితలో "ఒకప్పుడు మనిషిని గుర్తించడం చాలా సులభం/ పుస్తకంతోనో పూలతోనో/ నలుగురు మనుషులతోనో/ పిల్లలతోనో కలిసి నవ్వే వాడిని/ ఏడ్చేవాడినే మనిషిని అంటారు/.. అంటూ సాగే కవితలో .. లోపలి మనిషిని, లోపలి శిశువును/ కాపాడుకోవడమే జీవితం" అనడం ముచ్చట గొలుపుతుంది.

కదిలేది కదిలించేది... శ్రీశ్రీ అన్నట్లు కవిని గాఢంగా కదిలించి నీటి బుగ్గలా లోలోపల నుండి తన్నుకుంటూ బయటకు వచ్చే జలధారలా కవిత్వాభివ్యక్తి చాలా బలంగా రావాలంటే, రాయకుండా ఉండలేనట్టు లోపల ఆ భావం కుదిపేస్తున్నప్పుడు, కలం వేగంగా కదులుతుంది. భావ శబలత అపురూపమైన శబ్దావళిగా ధ్వనించే అక్షరాలు, పరిపూర్ణంగా విచ్చుకొని పరిమళించడానికి సిద్ధమవుతాయి. ఆ పరిమళాలు పఠితల మనసులను పరవశింపచేస్తాయి. కొన్ని గుచ్చుకుంటాయి, కొన్ని కళ్ళు తెరిపిస్తాయి, కొన్ని అజ్ఞానపు పొరలను తొలగింపచేస్తాయి. మొత్తంగా భావ సముదాయం రసజ్ఞతకు పట్టం కట్టి మనసుకు విందు చేస్తాయి. కవి ఎంచుకున్న విషయాలను బట్టి పాఠక వర్గం- సామాజిక చేతన, కవి అంతశ్చేతనతో అనుసంధానింపబడి, ఆలోచనామృతమై ఆ అక్షర సేద్యం అత్యుత్తమ ఫలితాన్ని ఇస్తుంది. పలమనేరు బాలాజీ కవితా సంపుటి మానవీయ సంస్పందనలతో నిండి సాహిత్య ప్రయోజనాన్ని సంపూర్ణంగా నెరవేర్చింది.

- మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

శేషేంద్ర మినీ కవితలో చైతన్య స్ఫూర్తి

సందర్భం

సంప్రదాయ సాహిత్యంలో సర్వోన్నత స్థాయిని అందుకున్న గుంటూరు శేషేంద్ర శర్మ ఋతుఘోష, జనవంశం వంటి కావ్యాలను రచించిన అనంతరం, సాహిత్యం సామాన్యునికి చేరువ కావాలన్న సంకల్పంతో రూపకల్పకల్పన చేసిన ప్రక్రియ లఘు కవిత లేదా మినీ కవిత. 1974లో వెలువడిన 'మండే సూర్యుడు', 1985లో వెలువడిన అరుస్తున్న ఆద్మీ శేషేంద్ర వెలువరించిన మినీ కవితా సంకలనాలు. 'ఆధునిక మహాభారతం'లో ఇవి సూర్యపర్వం, ఆద్మీ పర్వంగా చోటు చేసుకున్నాయి. మండే సూర్యుడు (సూర్యపర్వం)లో 'నేను చెమట బిందువును..' అంటూ ప్రారంభమయ్యే మొదటి కవితలో ...

సింధువంత చరిత్ర నా పిడికిట్లో ఉన్నా
చెప్పకుండా మనిషిని చెక్కిన శిల్పిని
వెళ్లిన పక్షుల గుంపులు వెనక్కి రాలేదని
ఆక్రోశిస్తున్న అడవుల్లో
చిక్కటి నక్షత్రాలు కలుపుకొని
చీకట్లు ఆస్వాదిస్తున్నా
స్మృతులతో అల్లిన పైట చెరగు పట్టుకుని
నా దేశం పాదాలు పెనవేసుకుంటున్నా' అంటున్నారు

శేషేంద్ర. ఇంత చిన్న కవితలో గత చరిత్ర ఘన కీర్తిని.. చైతన్య స్ఫూర్తిని, ఆశావాద దృక్పథాన్ని.. జాతీయ వాదాన్ని పెనవేసిన తీరు అపూర్వం. మినీ కవితకు అత్యావశ్యకమైన భావగాంభీర్యానికి ఇది పరాకాష్ఠ. ఎంతో విస్పష్టంగా వ్యక్తీకరించిన ఈ భావజాలమే తన జీవనాడి అని శేషేంద్ర స్వయంగా ప్రకటించారు.

'సూర్యుడు అస్తమించని నా మాటల దేశాల్లో
చెమట ముత్యాల కిరీటాలు దాల్చిన దేవతలు' అంటూ

ఆయన శ్రామికులను కీర్తించారు.

'ఎన్నాళ్ళో పెంచి పోగు చేసిన వాళ్ళు
ఎండల తలపాగాలతో వెళ్ళిపోతూ ఉంటే
మిలియన్ల గొంతులెత్తి
ఏడుస్తున్నవి ధాన్యపు రాశులు
గుండెలో నాగలి గుచ్చుకొని
కెవ్వున కేక వేసింది ధరిత్రి' అంటూ భూస్వామ్య

పెత్తందారీ వర్గాల శ్రమ దోపిడిని నిరసిస్తూ మార్క్సిస్టు మౌలిక సూత్రాలను మానవీయ కోణంలో ఆవిష్కరించారు.

శేషేంద్ర సుందర స్వాప్నికులు. అందుకే..

'అవిగో తూర్పున జ్వాలలు
పీడిత మానవులెత్తిన/ మోదుగు
పువ్వుల మాలలు' అంటూ శ్రమైక జీవన సౌందర్యాన్ని వీక్షిస్తున్నారు. అయినా ఆయన ఏనాడూ వాస్తవాన్ని విస్మరించి ఊహాలోక విహారం చేసేవారు కాదు. అందుకే ..

'కలల రక్తనాళాల్లో రక్తం కాదు
భావితరాల కోసం బలైన
ప్రాణాలు ప్రవహిస్తున్నాయి' అంటూ ఓ నగ్నసత్యాన్ని

మరింత ఉద్విగ్నంగా వ్యక్తీకరిస్తున్నారు.



'జైళ్ల కటకటాలకే ఖర్చవుతుంది
దేశంలో ఇనుమంతా
రైలు పట్టాలకు మిగలడం లేదు రవంత
దేశ సంపదను పెంచ వలసిన మౌలిక వనరులు

పాలకవర్గాల వల్ల ప్రజాప్రయోజనాలకు దూరమై దుర్వినియోగమవుతున్నాని, ఎటువంటి అతిశయోక్తులూ లేని స్వభావోక్తిలో వివరిస్తున్నారు.

శేషేంద్ర అంకురార్పణ చేసిన మినీ కవితా మహోద్యమం తెలుగు నాట శాఖోపశాఖలుగా విస్తరించింది. శేషేంద్ర స్ఫూర్తితో ఎంతోమంది నవతరం యువతరం కవులు వెలుగులోకి వచ్చారు. ఈ ప్రక్రియకు ముగ్ధులై ఆనాడు మహాకవులు సైతం మినీ కవులయ్యారు. నానీలు, హైకూలు మినీ కవితా రూపాలే. ఇలా ఓ దశాబ్దం తర్వాత శేషేంద్ర మళ్లీ తనే ఆంధ్రజ్యోతి వార పత్రికలో శేషేంద్రజాలం శీర్షికన ఒక సంవత్సరం పాటు మినీ కవితలు రచిస్తూ, తను రగిలించిన అగ్నిని మరింత ప్రజ్వలింపజేశారు. ఈ శీర్షికలో ఎగసిన కవితా విస్ఫులింగాలే 'అరుస్తున్న ఆద్మీ' (ఆద్మీపర్వం) గా వెలుగు చూశాయి.

కోడికూత అంటే.. ఉషస్సు తూర్పును బద్దలు కొడుతున్న శబ్దమేనని భావించిన శేషేంద్ర కలం ఆద్మీపర్వంలో మరింత ఎరుపెక్కింది.

'అడవిలో నాకోసం మరణించిన
ఆ వీరుడికి/ ఎవడు కట్టగలడు ఎత్తైన సమాధి
నా గుండె వాడి మీద లేచిన గోపురం
నా అశ్రువులే
వాడి మీద రాలుతున్న పూలు' అంటూ సామాజిక

వైరుధ్యాలపై వర్గ పోరాటాలకు శేషేంద్ర అక్షర హారతులిచ్చారు.

'తమ్ముడు అడవిలోకి వెళ్లి
మళ్లీ రాకపోతే/ తడికన్నులతో నిరీక్షించకు
ఈ దేశమంతా వాడి విశ్వరూపమే
మరచిపోకు - మరణించిన వీరుడు
ఈ ధరిత్రికి ఒక కొత్త నక్షత్రం'

ఒక అమరవీరునికి ఇంతకు మించిన నివాళి ఉంటుందా! మరణించిన నదులు మాట్లాడతాయి మూసీలా.. అంటూ వ్యంగ్య వైభవం చూపించినా..

'ఈ పురాతన ధూళిలో
బతుకుతున్న వాడికి
ఒక ఇల్లు కావాలని చెప్పడానికి
మార్క్స్ కావాలా
నీకిది ఇన్నాళ్ళూ తోచకపోతే
నీ కంటే నేరస్థుడు లేడు' అంటూ అధిక్షేపించినా..
'చంపి కొండల్లో పారేసిన/ వాడి శరీరం
రాగం కోసం బిగించిన/ ఫిడేలులా పడిఉంది.' అంటూ

బీభత్స భయానకాన్ని సైతం నిర్భయంగా ఆలంకారికంగా అందించినా..

'అవసరమైనప్పుడు మాత్రం..
మనిషి కన్నీరు తుడవటం నీ వంతు
శరీరం పోయినా నిలిచేది నీ గొంతు' అంటూ తన

సందేశాన్ని సంగ్రామ భేరిలా వినిపిస్తారు. శేషేంద్ర సృష్టించిన ప్రతి మినీ కవిత ఆకృతిలో వామనావతారమైనా, మూడో పాదం దాటగానే ఆ భావజాలం త్రివిక్రమమై విశ్వాంతరాళానికి విస్తరిస్తుంది. శేషేంద్ర అక్షర హృదయం అరుణోదయం! తెలుగు జాతికి ప్రాతఃస్మరణీయం!

(ఈనెల 30 : శేషేంద్రశర్మ వర్థంతి)

- డా. వెనిగళ్ళ రాంబాబు
సినీగీత రచయిత

ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాల కోసం ఆహ్వానం

ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాల కోసం ఈ ఏడాది కూడా కథలను, కవిత సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కథలకు రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఉంటాయి. ఉత్తమ కవితా సంపుటికి రూ.40 వేల నగదు బహుమతి ఉంటుంది. విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రం, ప్రత్యేక సత్కారం ఉంటుంది. కవితా సంపుటి 2024 ఏప్రిల్ - 2025 మార్చి నడుమ ప్రచురితమై ఉండాలి. 25 కవితలకు తగ్గకుండా సంపుటి ఉండాలి. నాలుగు ప్రతులను కింది చిరునామాకు పంపాల్సి ఉంటుంది. పోటీకి పంపే కథలు ఈ పురస్కారం కోసం మాత్రమే రాసినవై ఉండాలి. నాలుగు ప్రతులను పోస్టు ద్వారా, సాఫ్ట్ కాపీని మెయిల్‌లో పంపాలి. బహుమతి కథలతో పాటు మరో తొమ్మిది కథలను సాధారణ ప్రచురణకు స్వీకరించి సంకలనంగా ప్రచురిస్తాం. ఖమ్మంలో నవంబర్‌లో జరిగే వేడుకలో అవార్డుల ప్రదానం ఉంటుంది. కథలు, కవితా సంపుటి పంపటానికి చివరి తేదీ : ఆగస్టు 31, 2025. చిరునామా : ఖమ్మం ఈస్థటిక్స్ సాహిత్య పురస్కారాలు, 5-7-200/11, పాకబండ బజార్, ఖమ్మం -507003. ఫోను : 98491 14369. Khammamaesthetics@gmail.com - రవిమారుత్

వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ ఫలితాలు

పాలపిట్ట మాసపత్రిక - వాసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన డాక్టర్ వాసా ప్రభావతి స్మారక కవితల పోటీకి దాదాపు 150 కవితలు వచ్చాయి. ప్రముఖ విమర్శకుడు డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్ బహుమతి కవితలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి : వీరగల్లులమై విస్తరిద్దాం - కరిపె రాజ్‌కుమార్; రెండో బహుమతి : మంట - ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్; మూడో బహుమతి : పిడికెడు ముద్ద - ములుగు లక్ష్మీ మైథిలి. ఇంకా 9మంది కవులు ప్రత్యేక బహుమతులు పొందారు.

వ్యాసరచన పోటీ

'పాకిస్తాన్‌తో యుద్ధం - భారత దౌత్య విధానం'పై వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నాం. పోటీలో నెగ్గిన వారికి తగు పారితోషికంతో పాటు ఘనంగా సన్మానం, వారి రచనను ప్రచురణ చేయడం జరుగుతుంది. ప్రఖ్యాత వైద్య నిపుణులు, పద్మశ్రీ ఆచార్య డా.కూటికుప్పల సూర్యారావు పురస్కారం - 2025' అందజేస్తాం. వ్యాసం డిటిపిలో 10 పేజీలకు మించకూడదు. ఈ వ్యాసం తమ సొంతమని, ఇప్పటివరకూ ఎక్కడా ప్రచురితం కాలేదని హామీ పత్రంలో పేర్కొనాలి. వ్యాసాలు చేరడానికి తుది గడువు : జూన్ 30, 2025. వ్యాసాలు పి.డి.ఎఫ్. ఫార్మేట్‌లో మెయిల్ చేయవచ్చు. మెయిల్ ఐడి: visakhasamskruthi2012@gmail.com


చిరునామా : శిరేల సన్యాసిరావు, ఎడిటర్, ఫ్లాట్ నెంబర్: 402, వైష్ణో కీర్తన అపార్ట్‌మెంట్, బొట్టవానిపాలెం, మధురవాడ, విశాఖపట్నం - 530048. - **శిరేల సన్యాసిరావు, 960307 67777**

మనిషి గాయాలు మౌనాక్షరాలై ...

అనేక సామాజిక రుగ్మతల ఆధిపత్యపు ఆజమాయిషీలో నిరంతర సంఘర్షణలో మనిషి పడే పరిపరి వేదనలకు అక్షరరూపమిస్తూ, బాధ్యతల్ని విస్మరిస్తూ, బాధల్ని పెంచుతూ, మానవీయ విలువల్ని దూరం చేసుకుంటూ మనిషి పోగొట్టుకుంటున్న మనిషితనాన్ని అన్వేషిస్తూ, అతని జీవన యానానికి మార్గాలను నిర్దేశిస్తూ వర్తమాన కవి బిల్ల మహేందర్ వెలువరించిన తాజా కవితాసంపుటి 'నేను మరణిస్తూనే వున్నాను'.

అనునిత్యం కళ్లముందు కనిపించే సమకాలీన సంఘటనాత్మక దృశ్యాలను వొడిసిపట్టుకున్న ఈ కవి కవిత్వం జీవన తాత్వికతను పులుముకొని నిరంతరం మానవత్వపు అన్వేషణలో తన అక్షరయానాన్ని సాగిస్తూ వుంది. ఒట్టిపోయిన మనుషుల్లో గట్టితనాన్ని వెతుకుతూవుంది. ప్రకృతినే వాక్యం చేయగలిగినా మనిషిని వాక్యం చేయడానికి సాధ్యం కాక వాక్యం చేయడానికి సాధ్యమయ్యే మనిషి కోసం తపిస్తూవుంది. ముఖ్యంగా దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతూ దానిని ఈ కవిచేత ఆచరణ సాధ్యమూ చేసింది. సామాజిక సంఘర్షణతో సతమతమయ్యే అనేక మానవీయ దృశ్యాలను స్పృశిస్తూ సామూహిక దుఃఖ గానాన్ని తన గానంగా ఆలపిస్తూ వుంది. తెలంగాణా ఉద్యమానికీ ఆ కవి కలం బాసటగా నిలిచింది. ఇప్పటివరకూ ఏడు కవితాసంపుటాలను వెలువరించిన ఈ కవికి ఇది ఏడో కవితాసంపుటి. ప్రత్యేక ప్రతిభావంతుల జీవనశైలి, కరోనా కల్లోలం మిగిల్చిన చేదు అనుభవాలు, వలస కార్మికుల వేదనాభరిత జీవితాలు, పురుషాహంకారంలో దగాపడ్డ బాల్కిస్ బానో జీవనయానం... ఈ అంశాలపై వెలువడిన నాలుగు కవితా సంకలనాలకు ఆ కవి సంపాదకత్వం వహించారు.

మహేందర్ కవిత్వానికి మనిషితనమే కేంద్రబిందువు. అదే ఇతని అక్షరాల అలలకు సింధువు. ఈ కవిత్వం మనిషి విద్వేషాలతో, విధ్వంసాలతో పోగొట్టు కుంటున్న మానవీయ విలువల్ని కోరుతుంది. బహుజన సామాజిక వికసనాన్ని అభిలషిస్తుంది. అందుకే విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలు మనిషి జీవితంలో సృష్టిస్తున్న శూన్యాలు, చెమట చుక్కలతో నగరాల్ని శిల్పాల్లా మలిచే శ్రమజీవన సౌందర్యం, దోపిడీకి గురయ్యే పూలపరిమళం, పచ్చని ఇంకుతో చేసిన మట్టి సంతకం మహత్తును ప్రపంచానికి చాటిచెప్పే చెమటపద్యం లాంటి రైతు జీవనయానం, ప్రకృతి విధ్వంసానికీ, మనుషుల మధ్య అనుబంధాల విధ్వంసానికీ దారితీస్తూ ఆకుపచ్చని అందాలన్నింటినీ మింగేస్తున్న



ప్రపంచీకరణ ప్రభంజనం, కులమతాల సరిహద్దులు నింపుకొని మనుషుల మధ్య ఎన్నో గోడలు లేచిపోయి గాయపడిన మట్టి కోల్పోయిన సారం, పేగుల్ని పోగులు పోగులుగా రాల్చుతూ వడుకుతూ కండలను కండెలుగా చేసి వొంపివేత్తే పట్టుబట్టలను నేసే బతుకుపోరు, ప్రేమ, ఆత్మీయతల కోసం గూగుల్‌లో సెర్చ్ చేసే స్థితికి వెళ్లిపోయిన అనుబంధాల కృత్రిమత్వం, మనుషుల ఆత్మీయతల్ని మింగి మనిషిని ఆసరా అయిన అతనిని నిరంతరం ముందుకు నడిపించే చేతికర్ర, అన్ని కాలాల్లోనూ, అన్ని సందర్భాల్లోనూ తన ఉనికిని, గొప్పతనాన్ని చాటుకునే సజీవ వాక్యం, మనిషి బతుకులోని చీకటిని పారద్రోలే అంబేద్కర్ చూపుడు వేలు, బతుకుకు అద్దం లాంటి అమ్మతనం, నూతన చరిత్రను లిఖించడానికి పిడికిలెత్తే చేతుల సంగమం, దగాపడ్డ స్త్రీల చైతన్యపు తెగింపు... ఇన్నీ ఈ కవికి కవితావస్తువులయ్యాయి.

కవిత్వం ఎలా రాయాలో, అసలు కవిత్వమంటే ఏమిటో ఈ కవి తనదైన శైలిలో చెబుతాడు. 'కురుస్తున్న వర్షాన్ని/ చినుకు చినుకు తడిసి ముద్దవుతున్న పువ్వును/ అది నలుగురికి పరిమళాన్నిపంచుతున్న రాయి/ మనిషి పువ్వులే నిండుతనంగా వుండాలనే దర్శాన్ని రాయి... నువ్వులే కాల్చినా/ నిలబడే వాక్యాన్ని రాయి' అంటూ పిలుపునిస్తాడు. ఆకలితో అలమటించే పిల్లవాడికి రొట్టెముక్కను అందించడమూ కవిత్వమేనంటాడు. కలుతున్న కడుపును ఆకలి తీర్చేటందుకు అమృతమై మెత్తగా కలిపిన పెరుగన్నం ముద్దలెక్క (మాట) మనిషి మాట వుండాలంటాడు. ఈ కవి స్త్రీ పక్షాన నిలబడి భార్య ఇంట్లో లేనప్పుడు అక్కడి దృశ్యాలను కవిత్వీకరిస్తాడిలా... 'ఇంటిముందు వాకిలి/ తానమాడలేదని చిన్నబుచ్చుకుంటుంది/ గదిలోని దుమ్మంత నెత్తికెక్కి కూర్చుంటుంది' (అమ్మ పొద్దున్నే ఊరెళ్లినప్పుడు)... ఈ వాక్యం ద్వారా పరోక్షంగా భార్యాభర్తల మధ్య వుండవలసిన శ్రమసమానత్వాన్ని గుర్తుచేస్తాడు.

దేహాలను తూకం వేస్తూ, అవయవాలకు కొలతలు తీస్తూ సౌందర్యాన్ని కొలిచే దేశం ఎప్పుడో వైకల్యం బారిన పడినందున ఆ వైకల్యాన్ని తొలగించడానికి సంకల్ప శస్త్రచికిత్స చేసే నిపుణుల కోసం అన్వేషిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి నిజమైన గాయాలను మౌనాక్షరాలుగా మార్చింది ఈ కవిత్వం.

- డాక్టర్ కొత్యాల అమరేంద్ర
91777 32414

తగ్గిన విదేశీ మారకం నిల్వలు

న్యూఢిల్లీ : భారత విదేశీ మారకం నిల్వల్లో ఒత్తిడి కొనసాగుతోంది. మే 16తో ముగిసిన వారంలో ఫారెక్స్ రిజర్వులు 4.9 బిలియన్ డాలర్లు తరిగిపోయి 685.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని ఆర్‌బిఐ తెలిపింది. అంతక్రితం వారంలో 690.6 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం రిజర్వులు 6 శాతం లేదా 5.12 బిలియన్లు పతనమై 81.2 బిలియన్ డాలర్లకు పరిమితం అయ్యాయి. ఐఎంఎఫ్ వద్ద రిజర్వులు 3 మిలియన్ల డాలర్లు తగ్గి 4.371 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

రామలింగ మఠాధిపతి లోకేశ్వరస్వామి అరెస్ట్

కర్ణాటక: రామలింగ మఠాధిపతి లోకేశ్వరస్వామిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెళగావిలో 17 ఏళ్ల బాలికపై స్వామీజీ అత్యాచారం చేసినట్లు కేసు నమోదైంది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం... లోకేశ్వరస్వామి రాయచూర్‌లోని ఓ లాడ్జిలో 2 రోజుల పాటు, బాగల్‌కోటకు తీసుకెళ్లి మళ్లీ అత్యాచారం చేశాడు. బాలికను మహాలింగపుర బస్టాండ్‌లో బాలికను వదిలేసి.. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెదిరింపులకు గురిచేశాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోకేశ్వరస్వామిపై అత్యాచారం, కిడ్నాప్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.


టెన్త్ రీవాల్యుయేషన్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ విజయభేరి మోగించింది. రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు అత్యధిక మార్కులు 599 సాధించి విజయకేతనం ఎగురవేశారని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 598 మార్కులు ఆపైన ఏడుగురు, 597 మార్కులు ఆపైన 42 మంది, 596 మార్కులు ఆపైన 109 మంది,595 మార్కులు ఆపైన 201 మంది, 590 మార్కులు ఆపైన 1184 మంది సాధించారు. ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.2 శాతం, సుమారు 80 శాతం బ్రాంచిలు నూరు శాతంఫలితాలు సాధించాయని సీమ తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, పటిష్టమైన అకాడమిక్ ప్రోగ్రాంలు, అంకితభావంతో పనిచేసే అధ్యాపకుల వల్ల మాత్రమే ఇంతటి విజయం సాధ్యమైందని తెలిపారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

964 మంది చిన్నారులను కాపాడాం : ఎన్‌సిపిసిఆర్

న్యూఢిల్లీ : పిల్లల అక్రమ రవాణా నిరోధక విభాగం ఇప్పటి వరకూ 964 మంది చిన్నారులను రక్షించిందని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) ఆదివారం వెల్లడించింది. బీహార్‌లోని సరన్ జిల్లాలోని ఒక ఆర్కెస్ట్రా నుంచి 17 మంది మైనర్ బాలికలను ఇటీవల రక్షించినట్లు ఎన్‌సిపిసిఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. సరన్ జిల్లాలో కొన్ని స్థానిక ఆర్కెస్ట్రా బృందాలు బాలికలను నిర్బంధించి అశ్లీల నృత్యాలు చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఒక ఎన్‌జిఒ నుంచి ఫిర్యాదు వచ్చింది. ఈ ఫిర్యాదు తరువాత పిల్లల అక్రమ రవాణా నిరోధక విభాగం రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. రక్షించిన బాలికలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపర్చారు. బాలికల పునరావాసాన్ని ఈ కమిటీ పర్యవేక్షిస్తోంది. జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ రక్షణ) చట్టం 2015, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం 2012, పిల్లల ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం 2009 వంటి చట్టాల్లో, రాజ్యాంగంలో పొందుపరచబడిన పిల్లల హక్కులను రక్షించడానికి కట్టుబడి ఉన్నామని ఎన్‌సిపిసిఆర్ పునరుద్ఘాటించింది.



ఉక్రెయిన్ డ్రోన్ దాడి నుంచి తృటిలో తప్పించుకున్న పుతిన్

మాస్కో : రష్యా అధ్యక్షుడు పుతిన్ హెలికాప్టర్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి యత్నించింది. ఈ దాడి నుంచి పుతిన్ తృటిలో తప్పించుకున్నట్టు అధికారులు తెలిపారు. రష్యాలోని సెన్సిటివ్ బోర్డర్ ప్రాంతం కుర్స్క్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత పుతిన్ పర్యటనకు వెళ్లినప్పుడు ఈ ఘటన జరిగిందని తెలిపారు. ఉక్రెయిన్ బలగాలను ఈ ప్రాంతం నుంచి తరిమికొట్టినట్టు ఏప్రిల్‌లో మాస్కో ప్రకటించినప్పటి నుంచి కుర్స్క్ ఏరియాలో పుతిన్ పర్యటించడం ఇదే ప్రథమం. పుతిన్ ఎయిర్ రూట్‌పై ప్రయోగించిన ఉక్రెయిన్ డ్రోన్‌ను అక్కడికి చేరకముందే మార్గమధ్యంలోని రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టం అడ్డుకుని కుప్పకూల్చినట్టు అధికారులు చెప్పారు. ప్రెసిడెంట్ కాన్వాయ్‌ను గాల్లో ఉండగానే ఢీకొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా జరిపిన దాటి యత్నంగా దీనిని రక్షణ విభాగం సీనియర్ అధికారి పేర్కొన్నట్టు రష్యా మీడియా తెలిపింది.' ఈ ప్రయత్నాన్ని ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెంటనే గ్రహించి డ్రోన్‌ను కూల్చేయడం ద్వారా ముప్పును తప్పించినట్టు ఆ అధికారి చెప్పారు. ఉక్రెయిన్ డ్రోన్ ఏవిధంగా కుర్స్క్ ఎయిర్ స్పేస్‌ను ఉల్లంఘించింది? ఇది హత్యాయత్నం కావచ్చా? కీవ్ సైకలాజికల్ స్ట్రాటజీలో ఇదొక భాగమా? అనే కోణాల నుంచి ప్రస్తుతం భద్రతా ఏజెన్సీలు విచారణ జరుపుతున్నాయి. కాగా, పుతిన్ ఎయిర్ రూట్‌లో డ్రోన్ దాడికి యత్నించినట్టు వస్తున్న వార్తలపై ఉక్రెయిన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

'మణిపూర్' పేరు తొలగింపుపై
వెల్లువెత్తిన ఆందోళనలు

- రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్తత
- టియర్ గ్యాస్ ప్రయోగించడంతో పలువురికి గాయాలు

ఇంఫాల్ : ప్రభుత్వ బస్సుపై నుంచి మణిపూర్ పేరును తొలగించడంపై ఆ రాష్ట్రంలో ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ (కొకొమి) ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో ఆదివారం ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. రాజ్‌భవన్‌ను ఘెరావ్ చేయడానికి వెళుతున్న నిరసనకారులను కాంగ్లా గేట్ వద్ద భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో భద్రతా దళాలు నిరసనకారులు ప్రతిఘటించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. నిరసనకారుల్ని చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది అనేక రౌండ్ల టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించాయి. దీంతో పలువురు ఆందోళనకారులు గాయపడ్డారు.



రాజ్‌భవన్ వద్ద ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

ఈ నెల 20న ఉఖ్రుల్ జిల్లాలో శిరుయ్ లిల్లీ ఉత్సవాన్ని కవర్ చేయడానికి జర్నలిస్టులను తీసుకువెళుతున్న ప్రభుత్వ బస్సును భద్రతా సిబ్బంది ఆపారు. బస్సు విండ్‌షీల్డ్‌పై రాసిన ఉన్న మణిపూర్ అనే రాష్ట్రం పేరు కనిపించకుండా తెల్ల కాగితంతో కప్పాలని బస్సులో ఉన్న సిబ్బందిని బలవంతం చేశారు. ఈ ఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. మణిపూర్ గుర్తింపును అవమానించినందుకు గవర్నర్ అజయ్ కుమార్ భల్లా క్షమాపణలు చెప్పాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. 'గవర్నర్ మౌనంగా ఉంటూ ప్రజల మనోభావాలను పట్టించుకోవడం లేదు. రాష్ట్రపతి పాలన అమల్లో ఉన్న సమయంలో మణిపూర్ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పూర్తిగా అవమానించారు. ఈ ఘటనపై దర్యాప్తు కోసం ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడం సరిపోదు. ఈ ఘటనకు పాల్పడిన వారిని శిక్షించాలి' అని నిరసనకారులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిజిపి రాజీనామా చేయాలని వారు నినాదాలు చేశారు.

సామాజిక బలోపేతం కోసమే

- కుల గణనపై ఎన్‌సిఎస్‌సి ఛైర్పర్సన్



న్యూఢిల్లీ : కుల గణన సామాజిక న్యాయాన్ని బలోపేతం చేస్తుందని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) ఛైర్పర్సన్ కిషోర్ మక్వానా తెలిపారు. ఢిల్లీలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ... కులగణన వెనుకబడిన వర్గాల అభివృద్ధికి సహాయపడుతుందన్నారు. జనాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలన్న ఎన్‌డిఎ ప్రభుత్వ నిర్ణయాన్ని మక్వానా స్వాగతించారు. 2011లాగా కాకుండా, సంక్షేమ పథకాలకు దామాషా ప్రాతిపదికన నిర్ధారించే కచ్చితమైన గణాంకాలు రాబట్టవచ్చునని అన్నారు. ఎన్‌సిఎస్‌సి-2011 కులాల వారీ జనాభా వివరాలను పూర్తిగా విడుదల చేయలేదని, 1931 తరువాత దేశవ్యాప్తంగా కులాల వారీ లెక్కలు సేకరించే తొలి ప్రయత్నం ఇదేనని చెప్పారు. అంబేద్కర్ కలలు కన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. విధాన నిర్ణయాలకు కుల గణన పునాదవుతుందని చెప్పారు. ముద్ర యోజన వంటి పథకాల లబ్ధిదారులకు మెరుగైన సేవలందించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. కులగణన ప్రక్రియలో ఎన్‌సిఎస్‌సి ప్రత్యక్షంగా పాల్గొనదని, జనాభా లెక్కల తరువాత విధాన రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. జనాభాలో ఏడు శాతం ఎస్‌సిలు ఉన్నారనే భావనపై తాము పని చేస్తున్నట్లు తెలిపారు. కొత్త జనాభా లెక్కలు ఎస్‌సిలకే కాకుండా, ముస్లిం, క్రైస్తవ వర్గాల్లోని ఉపకులాలకు కూడా వివరణాత్మక డేటాను అందిస్తుందన్నారు. కుల గణనను వ్యతిరేకించిన రాజకీయ పార్టీల ఉద్దేశాలు సరైనవి కావని అన్నారు. ఎన్‌సిఎస్‌సి రాష్ట్ర స్థాయిలో ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్నామని, ఇప్పటికే ఆ ప్రక్రియ పంజాబ్, రాజస్తాన్‌ల్లో ప్రారంభించామని చెప్పారు. పంజాబ్‌లో దళిత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందడంలేదని, చాలామంది యువకులు మాదకద్రవ్యాల వ్యసనంలో పడిపోయారన్నారని, డ్రాపౌట్ రేట్ ఎక్కువగా ఉందని చెప్పారు.

నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- జపాన్‌ను దాటేశాం
- నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రహ్మణ్యం



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జపాన్‌ను అధిగమించామన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో భారత్ నిలిచిందన్నారు. 10వ నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతుందన్నారు. ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా ఉందన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) వరల్డ్ ఎకానమిక్ అవుట్‌లుక్ ప్రకారం.. 2026 ఆర్థిక సంవత్సరానికి భారత్ నామినల్ జిడిపి సుమారు 4,187.017 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఏప్రిల్ ఎడిషన్ అంచనా వేసింది. జపాన్ జిడిపి అంచనా 4,186.431 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పటి వరకు భారత్ 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. 2025లో భారత ఆర్థిక వ్యవస్థ 6.2 శాతం, 2026లో 6.3 శాతం వృద్ధి చెందుతుందని ఐఎంఎఫ్ పేర్కొంది. 2025లో గ్లోబల్ ఎకానమీ 2.8 శాతం, 2026లో 3.0 శాతంగా ఉండొచ్చన్న ఐఎంఎఫ్ అంచనాలతో పోల్చితే భారత వృద్ధి అధికంగా ఉందని సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, భౌగోళిక పరిస్థితులు భారత్‌కు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత లక్ష్యాలు, ప్రణాళికలను అమలు చేసుకుంటూ పోతే వచ్చే రెండు, మూడేళ్లలో భారత్ 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందన్నారు.

రూ.16వేల కోట్ల రికవరీ లక్ష్యం

- 1 శాతం దిగువకు ఎన్‌పిఎలు
- పిఎన్‌బి ఎమ్‌డి అశోక్ చంద్ర



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) రుణ రికవరీలపై కీలక దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.16,000 కోట్ల అప్పులను రికవరీ చేయడం ద్వారా మొండి బాకీలను 1 శాతం దిగువకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పిఎన్‌బి ఎండి, సిఇఒ అశోక్ చంద్ర వెల్లడించారు. గడిచిన 2024-25 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో రూ.4,733 కోట్ల రికవరీ చేసినట్లు తెలిపారు. మున్ముందు కూడా గరిష్టంగా రికవరీలను పెంచడంతో పాటు తాజా మొండి బాకీలపై దృష్టి సారించనున్నామన్నారు. 2024-25లో మొత్తంగా రూ.14,000 కోట్ల మొండి అప్పులను రికవరీ చేయగలిగామన్నారు. ఈ ఏడాది రూ.16,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతీ త్రైమాసికంలోనూ సగటున రూ.1500-1,700 కోట్ల మొండి బాకీలు చోటు చేసుకోవచ్చని అంచనా వేశామన్నారు.

ముఖ్యంగా టెక్నికల్‌గా రద్దు చేయబడిన మొండి బాకీల వసూళ్ల రికవరీపై కసరత్తు జరుగుతుందన్నారు. ఈ విభాగంలోని రూ.6,000 కోట్లు ఉండొచ్చన్నారు. ఇందులో ప్రతీ త్రైమాసికంలో కనీసం రూ.1,500 కోట్లు రాబట్టాలని నిర్దేశించుకున్నామన్నారు. తమ బ్యాంక్ మొత్తంగా టెక్నికల్‌గా రూ.91,000 కోట్ల ఎన్‌పిఎలను రద్దు చేసిందన్నారు. ముఖ్యంగా రూ.25 కోట్ల నుంచి రూ.50 కోట్ల రుణ విభాగంలో ఎక్కువ ఎన్‌పిఎలు చోటు చేసుకుంటున్నాయన్నారు.

ఆర్ఎఎం సంస్థలకు మద్దతు

తమ బ్యాంక్ ముఖ్యంగా రిటైల్, అగ్రికల్చర్, ఎంఎస్ఎంఇ (ఆర్ఎఎం) రంగాలకు ప్రధాన మద్దతును అందించాలని భావించిందని అశోక్ చంద్ర తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రుణ పుస్తకంలో వీటి వాటా 58 శాతంగా ఉండొచ్చన్నారు. ఈ విభాగాలకు 2024-25లో రూ.6,02,682 కోట్లను జారీ చేయడం ద్వారా మొత్తం రుణ పుస్తకంలో 56 శాతం వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఆర్ఎఎంను 56 శాతం నుంచి 58 శాతానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో పిఎన్‌బి నికర లాభాలు రెట్టింపై రూ.16,630 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది రూ.8,245 కోట్ల లాభాలు నమోదు చేసింది. మొత్తం వ్యాపారం 14 శాతం పెరిగి రూ.26.83 లక్షల కోట్లకు చేరడం ద్వారా బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒక్కటిగా నిలిచింది.

21న వైజాగ్‌కు వస్తున్నా

- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



విశాఖపట్నం వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో తాను పాల్గొనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు. ప్రకృతి సౌందర్యానికి విశాఖపట్నం ప్రసిద్ధిగాంచిందన్నారు. అక్కడ యోగా చేయడం గొప్ప అనుభూతిని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ రేడియోలో ప్రసంగించారు. ఈ ఏడాది జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వైజాగ్ వేదికగా జరగనుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'యోగాంధ్ర' అనే ప్రత్యేక ప్రచారాన్ని నెల ముందే ప్రారంభించిందని ఈ సందర్భంగా ప్రధాని మోడీ గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను తెలియజేయడం, ప్రతి గ్రామానికి, పాఠశాలకు యోగా సాధనను పరిచయం చేయడం ఈ యోగాంధ్ర ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. ఇందులో 10 లక్షల మందికిపైగా యోగా అభ్యాసకులు పాల్గొనబోతున్నట్లు ఆయన చెప్పారు. ప్రత్యేక శిబిరాలు, స్కూల్ యోగా ప్రోగ్రామ్‌లు, మెగా ఈవెంట్లు ఇప్పటికే రాష్ట్రంలో ప్రారంభమయ్యాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. అలాగే తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో మహిళలు డ్రోన్లతో వ్యవసాయం చేస్తున్నారన్నారు. గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ పొందారని వివరించారు. పండ్ల తోటలపై పురుగుమందులు, పిచికారీ కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వీరిని స్కై వారియర్స్‌గా ప్రధాని మోడీ అభివర్ణించారు.

సొంత రాష్ట్రంపై శశిథరూర్ విమర్శలు

- తిప్పికొట్టిన జాన్ బ్రిట్టాస్



తిరువనంతపురం : కేంద్రప్రభుత్వం ప్రకటించిన 'ఆపరేషన్ దోస్త్'లో భాగంగా టర్కీలో 2023 భూకంపం సంభవించినప్పుడు కేరళ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రూ.10 కోట్ల సహాయంపై కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ విమర్శలు చేశారు. రెండేళ్ల క్రితం చేసిన ఆ సహాయం తప్పుగా చేసిన దాతృత్వం అని తాజాగా ఎక్స్‌లో పేర్కొన్నారు. అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియాలను సందర్శించే అఖిలపక్ష ప్రతినిధి బృందానికి శశిథరూర్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ వ్యాఖ్యలను సిపిఎం రాజ్యసభ సభ్యుడు జాన్‌బ్రిట్టాస్ తిప్పికొట్టారు. జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, మలేషియా, ఇండోనేషియాలో పర్యటిస్తున్న అఖిలపక్ష ప్రతినిధి బృందంలో సభ్యుడైన జాన్ బ్రిట్టాస్ స్పందించారు. 'శశిథరూర్ వ్యాఖ్యలు కావాలని కొన్ని అంశాలు మరిచిపోయినట్లు నటించడానికి ఉదాహరణ. నరేంద్రమోడీ ప్రభుత్వమే ఆపరేషన్ దోస్త్ పేరుతో టర్కీకి సహాయం చేసింది. కేరళను ఎందుకు తప్పుపట్టాలి' అని ఎక్స్‌లో ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం 2010 వరదల సమయంలో పాకిస్తాన్‌కు 25 మిలియన్ల సహాయం పంపడంపై శశిథరూర్ స్పందన ఏమిటని నిలదీశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు ముంబై దాడులకు పాల్పడిన రెండేళ్ల తరువాత ఈ సహాయాన్ని పంపారని గుర్తు చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్నేహితులు, శత్రువులు అని చూడకుండా సహాయంచేసే భారతదేశం నైతికతను శశిథరూర్ అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు.

షెంజెన్ వీసాల తిరస్కరణతో...
136 కోట్లు నష్టపోయిన భారత్

న్యూఢిల్లీ : గత సంవత్సరం షెంజెన్ వీసాల తిరస్కరణ కారణంగా మన దేశం ఫీజుల రూపంలో రూ.136 కోట్లు నష్టపోయింది. 2024లో మొత్తం 1.65 లక్షల స్కెంజెన్ వీసాలను తిరస్కరించారు. యూరోపియన్ యూనియన్‌లోని 29 దేశాలలో స్వల్పకాలిక పర్యటనల కోసం అనుమతించేందుకు స్కెంజెన్ వీసాలు జారీ చేస్తారు. గత సంవత్సరం అల్గేరియా, టర్కీ జాతీయుల తర్వాత షెంజెన్ వీసాల తిరస్కరణ కారణంగా ఎక్కువగా నష్టపోయింది భారతీయులే. షెంజెన్ వీసా కోరుకునే వ్యక్తి దరఖాస్తు ఫీజుగా రూ.8,500 చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తును ఆమోదించినా లేక తిరస్కరించిన ఫీజును వాపసు చేయరు.

గత సంవత్సరం భారతీయులు 11 లక్షలకు పైగా షెంజెన్ వీసాల కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 5,91,610 దరఖాస్తులకు ఆమోదం లభించింది. 1.6 లక్షలకు పైగా తిరస్కరణకు గురయ్యాయి. అంటే తిరస్కరణల రేటు 15 శాతంగా ఉంది. భారతీయ పర్యాటకులకు ఫ్రాన్స్ నుండే ఎక్కువగా తిరస్కరణలు ఎదురయ్యాయి. దీనివల్ల రూ.25.8 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే అల్గేరియా అత్యధికంగా రూ.153 కోట్లు నష్టపోగా టర్కీ (రూ.140.6 కోట్లు), భారత్ (రూ.136.6 కోట్లు), మొరాకో (రూ.95.7 కోట్లు), చైనా (రూ.66.7 కోట్లు) దేశాలు ఆ తర్వాతి స్థానాలలో నిలిచాయి.



బహ్రెయిన్ ఉపప్రధానితో
భారత ఎంపిల బృందం భేటీ


మనామా : బహ్రెయిన్ ఉప ప్రధానమంత్రి షేక్ ఖలీద్ బిన్ అబ్దుల్లా అల్ ఖలీఫాతో భారత ఎంపిల బృందం ఆదివారం సమావేశమైంది. భారత్ ఎదుర్కొంటున్న ఉగ్రవాద సమస్య గురించి, దానిని ఎదుర్కొనడానికి భారత్ దృఢ సంకల్పం గురించి వివరించారు. బిజెపి ఎంపి బైజయంత్ జే పాండా నేతృత్వంలోని ప్రతినిధి బృందం పాకిస్తాన్ కుట్రలు గురించి, భారత్ ప్రతిస్పందనల గురించి వివరించింది. పహల్గాం ఉగ్రదాడి తరువాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి వివరించడానికి అఖిలపక్ష ఎంపిల బృందం రెండు రోజుల పర్యటన కోసం శనివారం బహ్రెయిన్‌కు చేరుకుంది. బహ్రెయిన్ రాజధాని మనామాలోని గుదైబియా ప్యాలెస్‌లో ఆదివారం సమావేశం జరిగింది. బహ్రెయిన్ పార్లమెంట్ ఎగువ సభ ఛైర్మన్ అలీ బిన్ సలేహ్ అల్ సలేహ్‌తో కూడా భారత ఎంపిల బృందం సమావేశమైంది. బహ్రెయిన్‌లోని ప్రవాస భారతీయుల్ని కూడా ఎంపిలు కలుసుకున్నారు. ఇక్కడ ఉన్న ఇండియా హౌస్‌లోని మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద ఎంపిలు పుష్పాంజలి ఘటించారు. ఈ బృందం ఈ నెల 26న కువైట్‌కు బయలుదేరుతుంది. ఈ బృందంలో పాండాతో పాటు అసదుద్దీన్ ఒవైసి, గులాం నబీ ఆజాద్, రేఖాశర్మ కూడా ఉన్నారు.

ఇజ్రాయిల్ దాడుల్లో 14 మంది మృతి

గాజా స్ట్రిప్ : గాజాపై ఇజ్రాయిల్ దాడులు విరామం లేకుండా కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ చేసిన వైమానిక దాడుల్లో 14 మంది మరణించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ కూడా ఉన్నారు. సెంట్రల్ గాజాలోని టెంట్‌తో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంపైనా ఇజ్రాయిల్ సైన్యం బాంబుల వర్షం కురిపించింది. నిరాశ్రయుల కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అల్-అక్సా మార్టిర్స్ ఆసుపత్రి తెలిపింది. ఇటీవల ఇజ్రాయిల్ తన దాడులను మరింతగా పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ ఈ దాడుల్లో 53 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. ఇక గాజాలో అనేక ప్రాంతాలను ఇజ్రాయిల్ నామరూపాలు లేకుండా చేసింది. అలాగే 90 శాతం పాలస్తీనీయుల్ని వారి ఇళ్ల నుంచి బలవంతంగా బయటికి పంపింది.

మరోవైపు బందీలను విడిపించాలని, పాలస్తీనాపై నరమేధం ఆపాలని ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్‌లో ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేశారు.

వేసవి విడిది



రైతన్న కష్టం

ప్రతిరోజూ చెమటోడ్చి
సుఖాన్ని దూరం చేసుకుని
కష్టాన్ని స్వాగతించి
రాత్రింబవళ్లు విశ్రమించక శ్రమించి
ప్రజల కడుపు నింపడం గురించి
వారు ఆకలితో అలమటించి
దేశ సుఖం కొరకు ఆలోచించి
వారు దు్ఃఖాలను అనుభవించి
మనకు సంతోషాన్నిచ్చి
తన చిరునవ్వును మరచి
హలాన్ని మిత్రుడిగా భావించి
పైరు పంటలని ఆస్తిగా గ్రహించి
మట్టిలో ముత్యాలు పండించి
ప్రతి పరిస్థితిని ఒకే రీతిగా స్వీకరించి
ఈ నేలకే తన సర్వస్వాన్ని అర్పించి
పని ఉన్న లేకున్నా ఉదయాన్నే లేచి
కారమన్నానైనా కండ్ల కద్దు కొని భుజించి
పంటలెన్నో పండించి
ప్రాణికోటికి ఆకలి తీర్చే
ఓ రైతన్న నీకు ఇవే
శతకోటి వందనాలు
జై జవాన్! జై కిసాన్!





- బి.బ్లెస్సీ,
8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రామంచ, చిన్న కోడూరు.





ముగ్గురు స్నేహితులు

సిరిపురం గ్రామంలో ఓ పాఠశాల ఉంది. అక్కడ చిన్ను, చిట్టి, చిక్కి అనే ముగ్గురు స్నేహితులు ఉన్నారు. ఒకరోజు వాళ్లు పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు రోడ్డు పక్కన చిన్ను వాళ్ళ అమ్మమ్మ కనిపించింది 'చిన్ను! నాతో మార్కెట్‌కి వస్తావా' అని అడిగింది. అప్పుడు చిన్ను 'అమ్మమ్మ! సారీ, నేను రాను. ఎందుకంటే నా స్నేహితులను వదిలి నీతో వస్తే నాకు చాలా బాధ వేస్తుంది. వాళ్లు కూడా చాలా బాధపడతారు. అని చెప్పింది. 'సరే' అని చెప్పి అమ్మమ్మ అక్కడి నుండి వెళ్ళిపోయింది. అలాగే నడుస్తూ ఇంకాస్త దూరం వెళ్లారు. అప్పుడు చిట్టి వాళ్ళ నాన్న బండి మీద వచ్చి 'చిట్టి బండి ఎక్కుతావా? ఇంటికి వెళ్దాం' అన్నాడు. అప్పుడు చిట్టి, 'నేను నీతో రాను నాన్న. నా స్నేహితులతో నడుచుకుంటూ వస్తాను. నువ్వు ఇంటికి వెళ్లు' అని చెప్పింది. 'సరే చిట్టి జాగ్రత్త' అని నాన్న ఇంటికి వెళ్ళాడు.

అలాగే వెళుతుండగా చిక్కి వాళ్ళ అమ్మ, నాన్న, తమ్ముడు బస్టాండ్‌లో కనిపించారు. వాళ్లని చూడగానే చిక్కి చాలా కంగారుగా 'అమ్మ ఎక్కడికి వెళ్తున్నారు?' అని అడిగింది. అప్పుడు వాళ్ళ అమ్మ, 'మేము ఊరికి వెళుతున్నాము నువ్వు కూడా మాతో రా' అని చెప్పింది. చిక్కి 'సరే' అంది. అప్పుడు చిట్టి, చిన్నుతో 'చూశావా! మనం స్నేహానికి ఎంతో విలువ ఇచ్చి అమ్మమ్మ, నాన్న పిలిచినా వెళ్లలేదు. చిక్కి మాత్రం వాళ్ల అమ్మానాన్నతో ఊరు వెళ్లడానికి సిద్ధమైపోయింది' అని అంది. అప్పుడు చిన్ను, 'అలాంటిదేమీ లేదు. మనం ఇద్దరం ఊళ్లో ఉన్న అమ్మమ్మ, నాన్నతో బయటికి రామని చెప్పాం. కానీ చిక్కి వాళ్ల అమ్మానాన్న ఊరు వెళుతున్నారు. వాళ్లతో అది వెళ్లకపోతే ఎలా? మనం చెప్పిందానికి, చిక్కి చేసిందానికి చాలా తేడా ఉంది. చిక్కిని అపార్థం చేసుకోకు. అది ఊరు బస్సు ఎక్కేవరకు ఇక్కడే ఉందాం' అని చెప్పింది. చిక్కి ఊరు బస్సు ఎక్కగానే చిట్టీ, చిన్ను నవ్వుతూ టాటా చెప్పారు.



- ఎస్.ప్రసన్నలక్ష్మి, 5వ తరగతి,
ఎం.పి.పి.ఎస్. జక్కాపూర్,
నారాయణరావుపేట.

బొమ్మల కొలువు





పవన్,
8వ తరగతి,
హరనాథపురం,
బాబానగర్, నెల్లూరు.



ఎ.వి.ఎస్.మహీధర్,
5వ తరగతి,
నారాయణ ఆంగ్లో వేదిక్ స్కూలు,
నందిగామ, ఎన్‌టిఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన the family

జీవన సౌరభం

ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, ఎదుటివాళ్ల మాటకు విలువనివ్వడం అలవరచుకొంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

ప్రమాదాల నియంత్రణకు చిన్నారుల యోచన



ఇంటి నుంచి ప్రతిరోజూ బయటకు వెళ్తుంటాం. దూరం వెళ్లాంటే ద్విచక్ర వాహనం తప్పనిసరి. హెల్మెట్ లేకుండా వెళ్తే ప్రమాదాలు జరుగుతుంటాయి. అదే బండికి డ్రౌసీ డిటెక్టర్ అమర్చితే హెల్మెట్ లేకుండా బండి అంగుళం కూడా కదలదు. అలాగే వాహనాలు చోరీకి గురి కాకుండా కూడా సెన్సార్ సిస్టం పనిచేస్తుంది. ఈ పరికరాన్ని రూపొందించటమే కాకుండా ఇటీవల పెద్దల ముందు ప్రదర్శించారు పల్నాడు జిల్లాలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు.

పల్నాడు జిల్లా గురజాల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూలు విద్యార్థులు సెన్సార్ టెక్నాలజీతో పలు అద్భుతాలు సృష్టిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించే కృషిలో వారు భాగస్వాములవుతున్నారు. హెల్మెట్ ధరించకపోవటంతో జరిగే రోడ్ల ప్రమాదాల్లో ప్రతిరోజూ చాలామంది చనిపోతున్న విషయాన్ని వారు తెలుసుకుని చలించిపోయారు. మన దేశంలో గంటకు ఇద్దరు, రోజుకు 58 మంది, నెలకు 1700, ఏడాదికి 20 వేలకు పైగానే ప్రమాదాల కారణంగా రోడ్డున పడుతున్నారనే గణాంకాలను సేకరించారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి కారణమవుతున్న విషయాన్ని తెలుసుకున్నారు. వాహన ప్రమాదాల్లో అప్రమత్తతతో పాటుగా జాగ్రత్తలు తీసుకుంటే కొంతమేరకైనా ప్రాణనష్టం వాటిల్లకుండా చూడొచ్చునని ప్రయోగాత్మకంగా నిరూపిస్తున్నారు. ముఖ్యంగా హెల్మెట్, సీటు బెల్టు ధరించటం వల్ల వాహన ప్రయాణాల్లో ప్రమాదాలు సింహభాగాన్ని తగ్గించొచ్చునని తెలియజేస్తున్నారు.

హెల్మెట్లు, సీటు బెల్టులు లేని కారణంగా ఏపి, తెలంగాణాలో ఏటా 10 వేల మందికిపైగా మృత్యువాత పడుతున్నారు. 20 వేల మందికి పైగా గాయపడుతున్నారు. హెల్మెట్ పెట్టుకోకపోవటం కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 60 వేల మంది మృతి చెందుతున్నారని అంచనా.

ప్రమాదాన్ని ముందే గుర్తించేలా ...

సెన్సార్ టెక్నాలజీ ద్వారా రోబోటిక్ పద్ధతుల్లో 'డ్రౌసీ డిటెక్టర్', 'స్మార్ట్ హెల్మెట్, బైక్ థెఫ్ అలారమ్'లు రైడర్లకు ప్రమాదాలను ముందే గుర్తించడంలో సహాయం చేస్తాయి. ప్రమాదాలను అరికట్టే ఒక సరికొత్త పరిష్కారంగా 'డ్రౌసీ డిటెక్టర్' దోహదపడుతుంది. దేశంలో ప్రస్తుతం బైక్ రైడింగ్ సమయంలో దారుణమైన ప్రమాదాలు జరుగుతున్నాయి. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయటం, అలసట లేదా నిద్ర వస్తున్న సమయంలో డ్రైవింగ్ చేయటం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. అదే డ్రౌసీ డిటెక్టర్‌ను బైక్‌కు అమర్చటం ద్వారా ఈ పరికరం బైక్ రైడర్ జ్ఞానశక్తిని మానిటర్ చేసి, అతనికి నిద్రపోవడం లేదా అలసట వస్తే వెంటనే డ్రౌసీ డిటెక్టర్ హెల్మెట్‌లో అమర్చిన సెన్సార్ల ద్వారా పనిచేస్తుంది. ఇది రైడర్ శరీర భాష, ప్రదర్శనను ట్రాక్ చేస్తుంది. నిద్ర లేదా అలసటగా కనుగొన్నప్పుడు, ఆటోమేటిక్‌గా హెచ్చరిక అలారం పంపిస్తుంది. ఈ అలారం రైడర్‌కు అలెర్ట్‌చేసి ప్రమాదం పొంచివుంది జాగ్రత్త అంటూ హెచ్చరికలు పంపిస్తుంది.



యాంటీ థెఫ్ట్ అలారం : స్మార్ట్ హెల్మెట్-బైక్ థెఫ్ అలారమ్ పరికరాలు వాహనం యాజమాన్యానికి సెక్యూరిటీని పెంచే కొత్త మార్గాన్ని అందిస్తున్నాయి. ఈ హెల్మెట్లు బైక్ ట్రాకింగ్ సిస్టమ్‌తో అనుసంధానమై ఉంటాయి. ఎవరైనా బైక్‌ని తీసుకెళ్లటానికి ప్రయత్నించినా, ఏదైనా వాహనంలో ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నప్పుడు ఈ హెల్మెట్ తక్షణమే యజమానికి అలారం పంపిస్తుంది. ఎక్కడున్నా తమ బైక్ సురక్షితమో కాదో తెలియజేస్తుంది. ఈ స్మార్ట్ హెల్మెట్లు ఆధునిక మోషన్ సెన్సార్లను ఉపయోగించి బైక్‌ను అనుమానాస్పదంగా ఎక్కడైనా తరలిస్తే అలారం యాక్టివ్ అవుతుంది. కొంత భాగంలో హెల్మెట్ కూడా డేటా యాక్సెస్ ఇవ్వడం ద్వారా, యజమానికి నోటిఫికేషన్స్ నిరంతరం వస్తూనే ఉంటాయి. అది బైక్ యజమానికి దొరికే వరకూ వస్తూనే ఉంటాయి. తద్వారా యజమానికి తమ వాహనం సురక్షితంగా ఉందనే సమాచారం అందుతుంది. చోరీలు, ఇతర అవాంఛనీయ పరిస్థితుల నుంచి రక్షించుకోవటానికి ఇవి దోహదపడతాయి.

సెన్సార్ ఎలా పనిచేస్తుందంటే

ఈ స్మార్ట్ హెల్మెట్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది బైక్ స్టార్టయ్యే ముందు రైడర్ హెల్మెట్ ధరించారా? లేదా? అని గుర్తిస్తుంది. హెల్మెట్‌లో ఏర్పాటు చేసిన సెన్సార్ వ్యవస్థ బైక్‌కు అనుసంధానమై ఉంటుంది. రైడర్ హెల్మెట్ ధరించినప్పుడే బైక్ స్టార్ట్ అవుతుంది. స్మార్ట్ హెల్మెట్‌లో మైక్రో కంట్రోలర్, బ్లూటూత్ మాడ్యూల్, ప్రెషర్ సెన్సార్ వంటి ఆధునిక సాంకేతికాలు ఉపయోగించబడ్డాయి. హెల్మెట్‌లోని ప్రెషర్ సెన్సార్ హెల్మెట్ ధరించినప్పుడు సిగ్నల్‌ను బైక్‌కు పంపుతుంది. ఈ సిగ్నల్‌ను స్వీకరించిన తర్వాతే ఇంజిన్ ఆన్ అవుతుంది. ఈ విషయాన్ని లిటిల్‌ఫ్లవర్ స్కూలు విద్యార్థులు ఇటీవల ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. రెంటచింతల ఎస్ఐ సిహెచ్.నాగార్జున పిల్లల మేధాశక్తిని అభినందించారు. లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ డైరెక్టర్ పి.వి.సుబ్బారావు, హెచ్‌ఎం ఎం.కృష్ణ పర్యవేక్షణలో రోబోటిక్ నిపుణులు, ఎస్ఆర్ఎంయు డైరెక్టర్ దాసరి నరేంద్రకుమార్ నేతృత్వంలో 5, 7, 8 తరగతుల విద్యార్థులు మట్టపల్లి మన్విత్‌రియా, కూరపాటి అశ్విని కీర్తి, మేకల సాయి చరణ్, మేకల అరవింద్, బండి అస్మిత తదితరులు ఈ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించారు.

- యడవల్లి శ్రీనివాసరావు

వినోదం భారమైంది... ఇండస్ట్రీ కళ్లు తెరవాలి

తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు వినోదమాధ్యమం సినిమానే. పెద్ద హీరోల సినిమాలు లేకపోవటం..సింగిల్ థియేటర్లు మాయమై మాల్స్‌గా మారిపోయి మల్టీప్లెక్స్‌లలో ధరలు బాగా పెరిగిపోయాయి. ఇదే క్రమంలో కరోనా తర్వాత పరిస్థితుల్లో ఓటీటీల్లో సినిమాలు అందుబాటులో ఉండటంతో సగటు ప్రేక్షకుడికి వినోదం అందుతోంది. కొత్త సినిమాలు కూడా వస్తుండటంతో థియేటర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కూడా పోతోంది. విడుదల రోజే పైరసీ హెడ్‌డి కాపీలు వస్తుండటంతో ఎంచక్కాఫోన్లు ఇళ్లల్లో టీవీల్లో వీటిని చూస్తున్నారు. ఈ క్రమంలో థియేటర్లకు ప్రేక్షకుల రాక తగ్గింది. రాష్ట్రప్రభుత్వం, టాలీవుడ్ పరిశ్రమ ప్రముఖులు ఈ విషయమై ఉమ్మడి అవగాహనతో కృషిచేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు.

గత కొన్నేళ్లుగా వేసవి అంటే సినిమా థియేటర్లకు పండగ. కానీ గత రెండేళ్లుగా ప్రేక్షకులు రాక వెలవెలపోతున్నాయి. రోజువారీ నిర్వహణా ఖర్చులు కూడా రాక మూతపడే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితికి కారణం ఏమిటి? పరిష్కార మార్గాలు ఏమిటి? అనే విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని టాలీవుడ్ ప్రతినిధులు తీవ్ర మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రేక్షకుడిని థియేటర్‌కు రప్పించాలంటే ఏమి చేయాలనే విషయమై గత కొద్దిరోజులుగా తీవ్ర మథనం కొనసాగుతోంది. ఇదే విషయమై ఈనెల 30న విశాఖపట్టణం కేంద్రంగా జరిగే సమావేశంలో సినీ పరిశ్రమ పెద్దలు ఓ కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి.

వేసవిలో పిల్లలకు సెలవులు ఉండటం, కుటుంబాలు మొత్తంగా పర్యాటక ప్రదేశాల సందర్శనలకు వెళ్లి వస్తుండటం మామూలే! మధ్యలో ఇంటిల్లిపాదీ సినిమా థియేటరుకు వెళ్లటం సహజమే! పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు, సెలవుల్లో కలిసిన స్నేహితులూ ఉమ్మడిగా సందడి చేసే ప్రదేశాల్లో సినిమా హాళ్లు కూడా ఉంటాయి. కానీ, ఈ వేసవి సెలవుల్లో మాత్రం అలాంటి సన్నివేశాలు కనపడలేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. అన్నిటికన్నా పెద్ద హీరోల సినిమాలు ఈసారి ఒక్కటీ రాకపోవటం కూడా ఒక ముఖ్య కారణం. థియేటర్లలో టిక్కెట్ల రేట్లు అమాంతంగా పెంచేస్తుండటం, తినుబండారాల రేట్లు ఆకాశాన్ని అంటుతుండటంతో బెంబేలెత్తిపోతున్నారు. ఒక కుటుంబంలో నలుగురు సినిమాకు వెళ్తే రూ.1500 నుంచి రూ.2000 వరకూ ఖర్చవుతోంది. పెద్ద హీరోల సినిమాలైతే ఒక్కో టిక్కెట్టు ధర రూ.800 నుంచి రూ.1200 వరకూ పెంచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారు సినిమా థియేటర్లకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది.

ఆక్యుపెన్సీ లేకపోవటంతో చిన్న హీరోల సినిమాలను విడుదల చేసేందుకు నిర్మాతలు ముందుకు రాలేని పరిస్థితి! థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని భావించిన సింగిల్ థియేటర్ల యజమానులు జూన్ ఒకటో తేదీ నుంచి హాళ్లు మూసేస్తామని ప్రకటించారు. అయితే తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రతినిధులు చొరవ తీసుకుని నిర్వహించిన మంతనాలతో ప్రస్తుతానికి బంద్ యోచనను విరమించుకున్నారు.

సమస్యకు 'తెర' పడుతుందా?

ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల డిమాండ్లపై చర్చించేందుకు తెలుగు ఫిలిం చాంబర్ ప్రతినిధులు ఈనెల 30న విశాఖపట్టణంలో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. అదే సమయంలో జూన్ 12న పవన్ కళ్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా విడుదల కానుంది. మిగతా పెద్ద హీరోల సినిమాలేమీ లేవు. ఈ క్రమంలో వ్యక్తిగత విషయాలకు పోకుండా సమస్య ప్రాతిపదికగా రాష్ట్రప్రభుత్వం, ఇండస్ట్రీ ప్రతినిధులు స్పందించి సమస్యపై ఉమ్మడిగా పనిచేయాల్సివుంది. అయితే తాజాగా ఉపముఖ్యమంత్రి, సినీనటుడు పవన్‌కళ్యాణ్; మంత్రి కందుల దుర్గేష్ వంటి వారు చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ఇండస్ట్రీ ప్రతినిధులు సంఘాల వారీగా వచ్చి తమను కలవాలనీ, తద్వారానే సమస్యలను పరిష్కరించుకుందామంటూ పేర్కొన్నారు. ఇప్పటికే టాలీవుడ్ పరిశ్రమ మొత్తం హైదరాబాద్ 8కేంద్రంగా నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన పదేళ్లయినా నేటికీ పరిశ్రమ తరలింపు ఊసే లేదు. అమరావతిలో 1000 ఎకరాల్లో సినీ స్టూడియోల నిర్మాణం, తరలివచ్చి స్టూడియోలు నిర్మించే దర్శకులు, నిర్మాతలకు రాయితీలు ఇస్తామంటూ ప్రభుత్వ పెద్దలు ప్రకటించినా కార్యాచరణలోకి రావటం లేదు.



నష్టాలే థియేటర్ల మూతకు కారణం

వాస్తవానికి థియేటర్ల మూత సమస్య ఇప్పటిది కాదు. గత కొన్నేళ్లుగా వివిధ సందర్భాల్లో జరిగిందే. కానీ ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో ఇండస్ట్రీ గురించి ఏమీ పట్టించుకోలేదనీ, తాము పట్టించుకుంటామంటూ చెబుతోంది. అయినా గతేడాది కూడా వేసవిలో కొత్త సినిమాలు లేకపోవటంతో ఆక్యుపెన్సీ లేక థియేటర్లు మూతపడ్డాయి. ఈ ఏడాది కూడా అలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. థియేటర్‌లో ప్రదర్శనలు రద్దు చేస్తే రోజుకు రూ.4 వేలు, ప్రదర్శనలు కొనసాగిస్తే రూ.6 వేలు నష్టం వస్తుందని థియేటర్ల నిర్వాహకులు వాపోతున్నారు. జిల్లా కేంద్రాల్లోనూ, పట్టణాల్లో ఒకొక్క థియేటర్ నిర్వహణకి రూ.10 వేలు నుంచి రూ. 12 వేలు, అదే కార్పొరేషన్‌లో రూ.15 వేలు నుంచి రూ.18 వేలు ఖర్చులు అవుతున్నాయి. వసూళ్లు వచ్చేసరికి రూ.5 వేల నుంచి రూ.6 వేల కూడా రావడం లేదని వాపోతున్నారు. సరైన సినిమాలు లేక ప్రేక్షకుడు థియేటర్‌కి రావడం లేదు. సింగిల్ స్క్రీన్‌లే కాదు, మల్టీప్లెక్స్‌ల్లోనూ ప్రదర్శనలు తగ్గిపోయాయి. ఓటీటీ మార్కెట్ కొత్త సినిమాల విడుదలలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కరోనా తర్వాత థియేటర్ కంటే, ఓటీటీ మార్కెట్టే బలంగా కనిపించింది. పోటీపడి మరీ భారీ రేట్లకి సినిమాల్ని కొనుగోలు చేశాయి ఓటీటీ వేదికలు. దాంతో ఆ మార్కెట్‌ని నమ్ముకునే సినిమాల్ని మొదలు పెట్టిన నిర్మాతలు చాలామందే. కానీ ఏడాదిలోపు పరిస్థితులు తారుమారయ్యాయి. ఓటీటీ సంస్థలు ఇప్పుడు ఆచితూచి సినిమాల్ని కొంటున్నాయి. ఓటీటీ వ్యాపారం ఆశించినంత లేకపోవడం చాలా సినిమాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడి చిత్రీకరణ దశలోనే ఉన్నాయి. మరికొన్నేమో తరచూ వాయిదా పడుతున్నాయి. స్టార్ కథానాయకులేమో పాన్ ఇండియా సినిమాలంటూ ఏళ్లకు ఏళ్లుగా వాటితోనే కాలం గడుపుతున్నారు. ఎప్పటికప్పుడు విడుదల తేదీలు ఖరారవుతున్నాయి, ఆ వెంటనే వాయిదా పడుతున్నాయి.

విజయంతో చెన్నై నిష్క్రమణ

83 పరుగుల తేడాతో గుజరాత్ ఓటమి
చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఊరట



అహ్మదాబాద్ : ఐపిఎల్18లో దారుణంగా నిరాశపరిచిన చెన్నై సూపర్‌కింగ్స్.. సీజన్‌ను ఘనంగా ముగించింది. యువ ఆటగాళ్లకు ప్రాధాన్యత ఇచ్చిన సూపర్‌కింగ్స్ ఆదివారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 83 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. సీజన్లో అత్యంత నిలకడగా రాణించిన టైటాన్స్‌ను చిత్తు చేసిన సూపర్‌కింగ్స్ వచ్చే సీజన్‌కు అవసరమైన ఆశావహ దృక్పథం సాధించింది!. 231 పరుగుల ఛేదనలో గుజరాత్ టైటాన్స్ తేలిపోయింది. ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగని టైటాన్స్ 18.3 ఓవర్లలో 147 పరుగులకు కుప్పకూలింది. సూపర్‌కింగ్స్ బౌలర్లలో అన్షుల్ (3/13), నూర్ అహ్మద్ (3/21) మూడు వికెట్లతో మెరిశారు. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 230 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (57, 23 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు), డెవాన్ కాన్వే (52, 35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీలతో రాణించారు. ఐపీఎల్18లో సూపర్‌కింగ్స్‌కు ఇది నాల్గో విజయం కాగా.. గుజరాత్ టైటాన్స్‌కు ఐదో పరాజయం.

మెరిసిన కాన్వే, డెవాల్డ్ : తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ సమిష్టి మెరుపులతో భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు ఆయుశ్ మాత్రె (34, 17 బంతుల్లో 3 ఫోర్లు,3 సిక్సులు), డెవాన్ కాన్వే (52) ధనాధన్ ఆరంభం అందించారు. ఆయుశ్ పవర్‌ప్లేలో మూడు సిక్సర్లు, మూడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఆరు ఓవర్లలోనే 68/1తో భారీ స్కోరుకు పునాది పడింది. ఆయుశ్ నిష్క్రమించినా.. ఉర్విశ్ పటేల్ (37, 19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), శివం దూబె (17, 8 బంతుల్లో 2 సిక్సులు) దంచికొట్టారు. డెవాల్డ్ బ్రెవిస్ (57) నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లతో విశ్వరూపం చూపించాడు. రవీంద్ర జడేజా (21 నాటౌట్) అజేయంగా నిలిచాడు. 20 ఓవర్లలో 5 వికెట్లకు సూపర్‌కింగ్స్‌ 230 పరుగులు చేసింది. టైటాన్స్ బౌలర్లలో ప్రసిద్ కృష్ణ (2/22) రెండు వికెట్లు తీసుకోగా.. సాయి కిశోర్, రషీద్ ఖాన్, షారుక్ ఖాన్‌లు తలా ఓ వికెట్ పడగొట్టారు.

ఛేదనలో చతికిల : 231 పరుగుల ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. సాయి సుదర్శన్ (41) మెరిసినా.. టాప్ ఆర్డర్‌లో శుభ్‌మన్ గిల్ (13), జోశ్ బట్లర్ (5) సహా రూథర్‌ఫోర్డ్ (0) నిరాశపరిచారు. 30/3తో కష్టాల్లో కూరుకున్న గుజరాత్ టైటాన్స్ మళ్లీ కోలుకోలేదు. షారుక్ ఖాన్ (19), రాహుల్ తెవాటియ (14), రషీద్ ఖాన్ (12), గెరాల్డ్ కొయేట్జి (5) నిరాశపరిచారు. అర్షద్ ఖాన్ (20) ఆఖర్లో ఓటమి అంతరాన్ని కుదించాడు. 18.3 ఓవర్లలో 147 పరుగులకే గుజరాత్ టైటాన్స్ కుప్పకూలింది. గ్రూప్ దశ చివరి రెండు మ్యాచుల్లో ఓడినా.. గుజరాత్ టైటాన్స్ ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. సూపర్‌కింగ్స్ బౌలర్లలో అన్షుల్, నూర్ అహ్మద్ మూడేసి వికెట్లు తీసుకోగా.. రవీంద్ర జడేజా (2/17), ఖలీల్ అహ్మద్ (1/17) రాణించారు.

'సన్‌రైజర్స్' సునామీ

- హ్యాట్రిక్ విజయంతో అదిరే ముగింపు..
- కోల్‌కతాపై సూపర్ విక్టరీ
- రాణించిన క్లాసెన్, హెడ్



ఢిల్లీ : సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పరుగుల సునామీ సృష్టించింది. బౌండరీలతో కోలకతా బౌలర్లను బెంబేలెత్తించారు. ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 278 పరుగుల భారీ స్కోరు నమోదు చేసి సూపర్ విక్టరీ సాధించారు.

ఐపిఎల్ 2025 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ విజయంతో ముగించింది. కోల్‌కతాపై హైదరాబాద్ 110 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తర్వాత జోరందుకున్న హైదరాబాద్.. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో అంతకుమించిన దూకుడు ప్రదర్శించి వరుసగా మూడో విజయంతో ఈ సీజన్‌కు టాటా చెప్పింది. హెన్రిచ్ క్లాసెన్ (105*; 39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సులు) మెరుపు శతకం బాదడంతో తొలుత సన్‌రైజర్స్ 3 వికెట్ల నష్టానికి 278 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ కొండంత లక్ష్యఛేదనలో కెకెఆర్ 18.4 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. మనీశ్ పాండే (37) టాప్ స్కోరర్. హర్షిత్ రాణా (34*) పరుగులు చేశాడు. ఓపెనర్ సునీల్ నరైన్ (31; 16 బంతులలో 3 ఫోర్లు, 3 సిక్సులు) దూకుడుగా ఆడినా దాన్ని భారీ ఇన్నింగ్స్‌గా మలచలేకపోయాడు. అజింక్య రహానె (15), అంగ్‌క్రిష్ రఘువంశీ (14), రమణ్‌దీప్ సింగ్ (13), క్వింటన్ డాకాక్ (9), రింకు సింగ్ (9) పరుగులు చేశారు. రస్సెల్ ఎదుర్కొన్న తొలి బంతికే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. హైదరాబాద్ బౌలర్లలో జయ్‌దేవ్ ఉనద్కత్, ఎషాన్ మలింగ, హర్ష్ దూబె తలో మూడు వికెట్లు తీశారు.

సన్‌రైజర్స్ బ్యాటర్లలో క్లాసెన్ శతకానికితోడు ట్రావిస్ హెడ్ (76; 40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సులు) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అభిషేక్ శర్మ (32; 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) క్రీజులో ఉన్నంతసేపూ సునామీ సృష్టించాడు. ఇషాన్ కిషన్ (29; 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 2, వైభవ్ అరోరా ఒక వికెట్ పడగొట్టారు.

సబలెంక శుభారంభం

- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



పారిస్ (ఫ్రాన్స్) : ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో మహిళల సింగిల్స్ టాప్ సీడ్ అరినా సబలెంక శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్లో రకిమోవపై 6-1, 6-0తో అలవోక విజయం సాధించింది. ఐదు ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లతో మెరిసి సబలెంక పాయింట్ల పరంగా 59-31తో ఆధిపత్యం చెలాయించింది. ఎలినా స్విటోలినా 6-1, 6-1తో ఏకపక్ష విజయంతో రెండో రౌండ్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో 12వ సీడ్ టామీ పాల్ 6-7(5-7), 6-2, 6-3, 6-1తో ఎల్మర్ మోలర్‌పై మెరుపు విజయం సాధించగా..మారియానో నవోనె 7-6(7-2), 4-6, 6-1, 6-2తో బ్రాండన్ నకషిమపై గెలుపొందాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68